

# మెహెర్‌బాబా

అవతార్ మెహెర్‌బాబాకే అంకితమైన మాసపత్రిక

సంపుటి :14 సంచిక: 13 హైదరాబాద్ 2015 మే పేజీలు 40

Please visit : www.srimeherbaba.com వార్షిక సభ్యత్వం : రూ.100/-

# ఓక్లహోమాలో నామ జపం

1952 మే 24న అమెరికాలోని ఓక్లహోమా ప్రాంతంలో మెహెర్‌బాబాకు కారు ప్రమాదం జరిగింది. ఆ సమయంలో మెహెర్‌బాబాతో పాటు మెహెరా, ఎలిజెబెత్ పాటర్‌సన్, మెహ్రూలు బాబాతోపాటు కారులో ప్రయాణిస్తున్నారు. ఈ సంఘటన జరిగిన ప్రాంతంలో 2015 మే 24న అమెరికాలో వుంటున్న స్థానిక హార్ట్‌లాండ్ బాబా సెంటర్ తరపున బాబా నామ జప కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు అక్కడవుంటున్న శ్రీ గౌరు గోపాల కృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

# మెహెరాబాద్‌లో పసిడి వేడుకలు

మెహెర్‌బాబా 1965 మే 1 నుండి 6 వరకు పూణేలోని గురుప్రసాద్‌లో తన ప్రేమికులకు బహిరంగ దర్శన కార్యక్రమం నిర్వహించి నేటికి 50 సంవత్సరాలు నిండుతున్న సందర్భంగా మెహెరాబాద్‌లో ఆనాటి మధుర స్మృతులను గుర్తుచేసుకునేలా స్వర్ణోత్సవ కార్యక్రమాలను **2015 నవంబరు 13, 14 తేదీలలో** ఏర్పాటు చేసినట్లు ట్రస్టు చైర్మన్ శ్రీ శ్రీధర్ కేల్కర్ ఒక ప్రకటనలో తెలిపారు.

# క్రిష్ణనగర్, వర్నిలలో సహవాస్

నిజామాబాద్ జిల్లా క్రిష్ణ నగర్‌లో జూన్ 13న,
వర్ని బాబా సెంటర్‌లో జూన్ 14న బాబా ప్రేమిక సహవాస్‌లు ఏర్పాటు చేసినట్లు స్థానిక బాబా ప్రేమికులు తెలిపారు. కాగా మరింత సమాచారం కోసం
శ్రీ ఎ. జనార్ధనరావు, నిజామాబాద్ సెంటర్, 99-08-78577 సంప్రదించగలరు.



# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్ నామ వ్యాప్తికి మీ బంధుమిత్రులలో కనీసం ఒకరిద్దరినైనా ప్రోత్సహించి పత్రిక వార్షిక లేక జీవిత సభ్యత్వం చెల్లింపజేయండి. పత్రిక పది వేల సైన్యంతో సమానమని గమనించగలరు. మరిన్ని వివరాలకు ఎడిటర్, మెహెర్‌బాబా, 995 955 3218ని సంప్రదించగలరు.

# బాబా సందేశం

మస్తులకు భగవంతుడొక్కడే తెలుసు.

వారు భగవంతుని ప్రేమలో నిరంతరం ఓలలాడుతుంటారు.

**The Mast loves and knows only God.**

**- మెహెర్‌బాబా**


**గౌరవ సంపాదకులు**

**మల్లాది కృష్ణానంద్**

**99595-53218,**

**040-65553218**

**malladisukku@gmail.com**

**వ్యవస్థాపకులు:**

**దశిక ప్రసాదరావు**

**040-65699611**


## లోపలి పేజీలలో...


| | |
|---|---|
| 1. సంపాదకీయం | 5 |
| 2. హిందీ సహవాస్ | 6-9 |
| 3. విశాఖలో మెహెర్ ప్రేమిక సహవాస్ | 10 |
| 4. మామాటలు | 11 |
| 5. బాటసారులు | 12-13 |
| 6. మహమద్ మస్తు | 14-19 |
| 7. లార్డ్ మెహెర్ | 20-26 |
| 8. రెండు సహవాస్‌లు | 27-33 |
| 9. మా మాటలు | 34-35 |
| 13. జీవిత సభ్యుల వివరాలు | 36-37 |
| 14. ప్రార్థనలు | 38-39 |



**ఉత్తర ప్రత్యుత్తరాలకు**

ఎడిటర్,
మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, యాప్రాల్,
ప్లాట్ నెం. 32,
జె.జె. నగర్‌కాలనీ ,
సికింద్రాబాద్-500 087
ఫోన్: 99595-53218


### మనవి

**మీ వ్యాసాలు, లేఖలు ఇతర సమాచారం మాకు ప్రతినెల 4వ తేదీ లోపల అందేలా పంపవలసింది. పత్రికను ప్రతినెల 19 లేదా 20వ తేదీలలో పోస్టు చేస్తున్నాం. 25వ తేదీలోగా పత్రిక మీ ముంగిట ఉంటుంది.**

Please visit : www.srimeherbaba.com

# చల్లపల్లి సెంటర్ స్వర్ణోత్సవాలు

చల్లపల్లి బాబా సెంటర్ స్వర్ణోత్సవాలు 2015 ఆగస్టు 29, 30 తేదీలలో ఘనంగా నిర్వహించనున్నామని కార్యదర్శి శ్రీ పి.వి. రమణారావు ఒక ప్రకటనలో తెలిపారు. కాగా, ఈ వేడుకలలో భాగంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలలో పాల్గొనగోరువారు తమ వివరాలు త్వరలో పంపవల్సిందిగా ఆయన కోరుతున్నారు.

# ఆంధ్రా రెస్టు హౌస్ జలనిధి



గెస్టు హౌసుకు అవసరమైన నీటిని ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేస్తున్నామని, ఇందుకు అధిక మొత్తంలో ఖర్చు అవుతోందని కార్యదర్శి శ్రీనివాస్ తెలిపారు. ఆర్థిక స్తోమత గల బాబా ప్రేమికులు ట్యాంకర్ల ద్వారా నీటిని కొనుగోలు నిమిత్తం ఏర్పాటు చేసిన జలనిధికి తగిన విరాళాలు పంపి సహకరించవల్సిందిగా శ్రీ వై. శ్రీనివాస్ (99 12 199978) కోరుతున్నారు.

## జూలై 10, మౌన వార్షికోత్సవం:

జూలై 10, మౌన వార్షికోత్సవం సందర్భంగా మెహెరాబాద్ వెళ్ళే బాబా ప్రేమికులు తమ బస ఏర్పాటుకై జూన్ 15లోగా ఆంధ్రా రెస్టు హౌసు కార్యదర్శి శ్రీ వై. శ్రీనివాస్ (99 12 199978) తెలియజేయవల్సిందిగా కోరుతున్నారు.
ఈ సమయంలో వృద్ధులకు, జీవిత సభ్యులకు బస ఏర్పాటులో తగిన ప్రాధాన్యత ఇవ్వడమౌతుందని శ్రీ శ్రీనివాస్ అన్నారు.

## హెల్ప్‌లైన్

ప్రతి నెలా 25లోగా మెహెర్‌బాబా పత్రిక పోస్టులో మీకు అందేలా తగిన ఏర్పాట్లు చేస్తున్నాం. ఐతే, ఏ కారణంగానో నెల చివరిదాకా కూడా పత్రిక పోస్టులో మీకు రాకుంటే హైదరాబాద్ బాబా ప్రేమికులు శ్రీ వి.ఆర్.కె.శాస్త్రి (98492 42284), శ్రీ కాగిత రామ్ (99481 28207) లను సంప్రదించగలరు. **మీ ఇ-మెయిల్ అడ్రస్ పంపితే పత్రికను ఇంటర్‌నెట్‌లో పంపగలం.**

## సంపాదకీయం

# సంపుటి - 15

'మెహెర్‌బాబా' మాస పత్రిక ప్రారంభించి 14 సంవత్సరాలు పూర్తయింది.
ఈ సంచికతో 15వ వసంతంలో అడుగిడుతున్నాం.
కాలం ఎంత వేగంగా గడుస్తోందో కదా!!
గత దశాబ్ద కాలంగా మాస పత్రికను నిరాడంబరంగా, అందంగా ప్రచురించి, సకాలంలో అంటే ప్రతినెలా 19వ తేదీ 12 గంటలకు ఠంచనుగా పోస్టలు బట్వాడాకు అందజేస్తున్నాం.
పత్రిక ప్రతి నెలా 25 కల్లా పాఠకులందరికీ అందుతోంది.
అలాగే, పత్రికను ప్రతినెలా 15 నాటికి www.srimeherbaba.com వెబ్‌సైట్‌లో ప్రచురిస్తున్నాం.

**మరో శుభవార్త!!**

ఆర్థిక పరంగా, పత్రిక బాలరిష్టాలను అధికమించింది.
సహృదయులైన పాఠకులందరికీ జై మెహెర్‌బాబా.

**MY WORK IS YOUR OPPORTUNITY - MEHER BABA**

బాబావారి ఈ సందేశాన్ని ఆచరణలో అమలుచేసేందుకు మా శాయశక్తులా కృషిచేస్తున్నాం. అవతార్ మెహెర్‌బాబాకు అంకితమైన మాస పత్రిక **మెహెర్‌బాబా.**
**మెహెర్‌బాబా సందేశాల వ్యాప్తి పత్రిక ఏకైక లక్ష్యం.**
**ఈ విషయంలో** మెహెర్‌బాబా నామ వ్యాప్తిని ఆకాంక్షించే ప్రతి బాబా ప్రేమికుడూ ఒక్కొక్కరూ కనీసం ఒకరిద్దరినైనా పత్రికకు సభ్యులుగా చేర్పించాలని మనవి!!
ఒక కొత్త సభ్యత్వం పది సహవాస్‌ల ఏర్పాటుతో సమానం అని మా భావన.
ఇందుకు బాబా ప్రేమికుల సహాయం కోరుతున్నాం.
యువతరం చొరవ చూపాలని మనవి.
అలాగే, మంచి రచనలు ప్రచురణార్థం పంపవల్సిందిగా కోరుతున్నాం.
పత్రికపై మీ అభిప్రాయాలు, స్పందనలు ప్రస్తుతాంశంలో అత్యవసరం.
పత్రికపై మీ మనస్సులోని మాటలు చెప్పండి.
మీ మాటలు మాకు మార్గదర్శకం.
అందరికీ జైబాబా..

# హిందీ సహవాస్

1955 నవంబరు 19 నుండి 24 దాకా మెహెరాబాద్‌లో బాబా సమక్షంలో ఉత్తర భారతానికి చెందిన ప్రేమికులతో వారం రోజులపాటు హిందీ సహవాస్ జరిగింది. ఇందుకు నవంబరు 16వ తారీఖు నుండే తగిన ఏర్పాట్లు మెహెరాబాద్‌లో చేపట్టారు. సహవాస్ ప్రాంగణమంతా పరిశుభ్రం చేయడానికి పెద్దఎత్తున సన్నాహ కార్యక్రమాలు జరిగాయి. ఉత్తరాది వంటకాల ఏర్పాటుకు బాబా మండలి ప్రేమికుడైన ఛగన్ మాస్టార్‌ని బాబా ఎంపికచేశారు. ఇప్పటిదాకా గుజరాతీ, తెలుగు ప్రాంతాలవారి సహవాస్ కార్యక్రమాలు మెహెరాబాద్‌లో విజయవంతంగా పూర్తయ్యాయి.

ఇకపై హిందీ సహవాస్ నవంబరు 19 నుండి ప్రారంభం కానుంది.

సహవాస్‌కి సహవాస్‌కి నడుమ విరామ సమయంలో చేపట్టే పరిశుభ్ర కార్యక్రమాలతో మండలివారి నడుం విరిగినట్లవుతుంది. అలుపెరుగక రాత్రింబవళ్ళు మండలి సభ్యులు ఈ కార్యక్రమాలకు హాజరవుతున్నారు. మెహెరాబాద్‌లో ఏర్పాట్లు ఎలా వున్నాయో చూసేందుకు నవంబరు 18న మెహెర్‌బాబా మెహెరాబాద్‌కు ఉదయం 8.47 ప్రాంతంలో వచ్చారు. బాబావారి కారు వస్తున్నట్లు మండలి సభ్యులందరికీ తెలిసేలా దూరం నుండే హారన్ గట్టిగా మ్రోగింది. అనంతరం బాబా సమావేశ హాలులోకి వెళ్ళారు.

మండలి సభ్యులు చాలామంది వారివారి పనుల్లో నిమగ్నమై మెహెరాబాద్‌లోని ఆ విశాల ప్రాంగణంలో వున్నారు. బాబావారు సమావేశహాలుకు వచ్చారని తెలిసి కూడా వారు తమ పని ఒత్తిడిలో బాబా ఎదుట హాజరు కాలేదు.

ఇది బాబాకు కోపం తెప్పించింది.

బాబా మెహెరాజాద్ నుంచి వచ్చారని తెలిసి కూడా,

వారు హుటాహుటిన చేతిలో పనులన్నింటినీ ప్రక్కన పడేసి బాబా ఎదుట హాజరు కావాలి కదా!! కానీ వారలా చేయలేదు. అందుకే బాబాకు కోపం వచ్చింది.

మండలి సభ్యులు పదకొండు మంది వారు చేస్తున్న పనుల్లోనే వుండిపోయారు.

దీంతో బాబా కోపంగా పేరు పేరునా పిలుస్తూ, వారిని తన ఎదుట హాజరుకమ్మనమన్నారు.

మీ కోసమై మెహెరాజాద్ నుంచి నేను ఇక్కడకు వస్తే,

మీ ముఖ:ం ఒక క్షణకాలం నాకు చూపించడానికి వీలు చిక్కలేదా? అని బాబా వారిని తీవ్రంగా ప్రశ్నించారు.

మీకు సిగ్గు లేదా? అన్నారు.

ఈ 11 మంది మండలి సభ్యులకి కుష్ఠు వ్యాధి సోకు గాక అన్నారు.

బొంబాయి నుండి కుష్ఠు వ్యాధికి వాడే మందులు తెప్పించమని మరో మండలి సభ్యుడు

మెహెర్‌జీతో అన్నారు. వీరికి తప్పకుండా ఆ వ్యాధి సోకుతుందన్నారు బాబా.
నేను సర్వోన్నతుడను. మానవాళి మంచి కోసం మీ స్థాయికి దిగి వచ్చాను.
మీరు నాకు అత్యంత సన్నిహితంగా వున్నారు. ఐనా, మీకు క్రమశిక్షణ కరువయ్యింది.
నా పట్ల మీకు గౌరవం లేదని, మండలి సభ్యులైన పెండూ, పాద్రీ, విష్ణు, భావూ,
అలోబాలను బాబా మందలించారు.
ఏమనుకుంటున్నారని కన్నెర్రజేశారు.
ఎందరో నా దర్శనం కోసం ఎన్నో వేల మైళ్ళ నుండి వస్తున్నారు.
మీరు నా దగ్గర్లోనే వుండి నా పట్ల ఎలా ప్రవర్తించాలో తెలియకుండా వున్నారన్నారు.
మరోసారి ఇదే తప్పు జరిగితే క్షమించనని హెచ్చరించారు.
ఇందుకు ప్రాయశ్చిత్తంగా ఈ రోజు మీరందరూ ఒంటిపూట భోజనం చేయమన్నారు.
మండలివారికి తనపట్ల గల విధేయత ఏపాటిదో తెలియజెప్పేందుకు
ఎల్లుండి హిందీ గ్రూపువారు వచ్చాక ఏరుచ్‌ని గుర్తుచేయమన్నారు.
ఇంతలో మండలి సభ్యుడు పాద్రీ కలగజేసుకుని బాబాతో వినమ్రంగా ఇలా అన్నాడు.
ఇటీవల అక్టోబరు 28న అంటే ఈ సహవాస్ కార్యక్రమాలు ప్రారంభానికి మునుపే
బాబావారిచ్చిన ఆదేశాలను ఆయన గుర్తు చేశాడు.
**“నీవు పిలిస్తే తప్పించి, మేం చేస్తున్న పనులను వదిలిపెట్టి నీ వద్దకు రావద్దన్నారు”.**
ఆ ఆదేశాల మేరకే మేము మా పనిలో మేమున్నాం.
నీవు మెహెరాబాద్‌కు వచ్చావని తెలిసి, నీవు రావడం చూసి కూడా..
పిలిచే వరకూ నీ ఎదుటకు రాలేక పోయాం అని, పాద్రీ వినయంగా చెప్పాడు.
నీవు పిలవ కుండా నీ ఎదుటకు రావడం, నీ ఆదేశాలను దిక్కరించినట్లే కదా!!
అన్నాడు పాద్రీ.
బాబా ఏమీ ఎరుగనట్లు - ఇది నిజమేనా? అని ఏరుచ్‌ని ప్రశ్నించారు.
ఇలాంటి ఆదేశాలు బహుశా బాబా ఇచ్చివుండవచ్చన్నాడు ఏరుచ్.
ఈ విషయమై మరింత తర్జనభర్జనలు జరిగాక
బాబావారి ఆదేశాలు కరెక్టేనని తేలింది.
దాంతో, నా ఆదేశాలను నేనే మర్చిపోయానన్నారు బాబా.
ఇందుకు శిక్షగా గుస్తాద్‌జీని తన కుడిచెవిని మెలిపెట్టమన్నారు.
గుస్తాద్‌జీ మండలి సభ్యులందర్లోకీ వయస్సు రీత్యా పెద్దవాడు.
కాబట్టి బాబా గుస్తాద్‌జీని తన చెవిని మెలిదీయమన్నారు.
డా॥ కనకదండిని బాబా పిలిచారు.
డా॥ కనకదండి తెలుగువాడు.
ఆంధ్ర సహవాస్‌లో చాలా చురుకుగా వ్యవహరించాడు.

బాబాని అమితంగా ప్రేమిస్తాడాయన.
బాబా ఆయనతో మాట్లాడుతూ నాపట్ల గల నీ ప్రేమ గురించి నాకు తెలిసిందని
బాబా ఆయన్ని అభినందించారు. ఇది నాకు చాలా సంతోషంగా వుందన్నారు.
డాక్టర్ కనకదండి అందుకు జవాబుగా
నీ ఎడల గల మా అందరి ప్రేమతో, మా తప్పుల్ని క్షమించు బాబా
అని వేడుకుంటున్నానన్నాడు.
దీంతో, బాబా చిరునవ్వుతో అందర్నీ క్షమిస్తున్నానన్నారు.
11 మంది మండలి సభ్యులు ఉపవాసం పాటించాల్సిన పన్లేదన్నారు.
గుస్తాద్‌జీతో నాకు నేనే శిక్ష వేయించుకున్నానన్నారు.
అయితే అవిధేయతని నేనెన్నడూ క్షమించనని గట్టిగా హెచ్చరించారు.
ఇకపై నేనెప్పుడొచ్చినా అన్ని పనులు వదిలి నా వద్దకు పరుగున రమ్మనమన్నారు.
అలా కానిపక్షంలో క్షమార్హులు కాదన్నారు.
ఆ తర్వాత బాబా, మండలి సభ్యుడు చేసిన మరో తప్పిదాన్ని ఎత్తిచూపారు.
అదేమంటే, మండలి హాల్లో బాబా అటూ-ఇటూగా నడుస్తుంటే
సన్నని దూళి ఆయన ముక్కుల్లో చేరిందని ఫిర్యాదు చేశారు.
నేలపై పరిచిన కార్పెట్‌లను సరిగ్గా దుమ్ము దులుపుతున్నారా? అని పెండూని ప్రశ్నించారు.
ఈ పని ఎవరు చూస్తున్నారని అడిగారు.
సుమారు గంటసేపు బాబా ఈ విషయమై ఎంతో కోపంగా వున్నారు.
కార్పెట్లు శుభ్రపరిచే బాధ్యత భావూ, సిద్ధూలది.
వారిద్దర్నీ బాగా గట్టిగా మందలించారు.
అసలు కార్పెట్లు ఎలా శుభ్రం చేస్తున్నారో
తన ఎదుట చేసి చూపించమన్నారు.
సిద్ధూ సరేనని తానెలా చేస్తున్నాడో చూపించాడు.
ఇందుకు బాబా తృప్తి చెందలేదు.
ఆ తర్వాత కార్పెట్‌ని ఆరుబయటకు తీసుకెళ్ళి గట్టిగా
అటూ-ఇటూ దులిపి శుభ్రం చేశాడు.
ఇదంతా నిశితంగా చూస్తున్న ఫ్రాన్సిస్ బ్రాబ్‌జాన్‌కు ఏమీ పాలుపోలేదు.
సుమారు గంట నుండి ఈ దుమ్ము దులపడంపై తానెందుకు దృష్టి సారించారో,
అందుకు వివరణ బాబా ఇలా అన్నారు.
ఇంత చిన్న విషయాల గురించి నేను మాట్లాడుతూపోతే
తనకి, సాధారణ మానవునికి తేడా ఏం వుందన్నారు.
ఇదంతా తన ఆధ్యాత్మిక కార్యక్రమంలో భాగమన్నారు.

ఇది తన ఆంతరంగిక కార్యక్రమంలో ఓ భాగమన్నారు.
మండలివారందర్నీ వెళ్ళి వారివారి పనులు హాజరుకమ్మనారు.
మండలివారు వారి పనులు చేస్తుంటే బాబా దూరం నుంచి వాటిని పరిశీలించారు.
ఓ బక్కెట్ నిండా నీటిని తోడుకుని భావూ దగ్గర్లోని టెంట్ వైపు నడుస్తూ వెళ్లడం చూసి, బాబా ఆయన్ని తన దగ్గరకు రమ్మనమన్నారు.
ఏం చేస్తున్నావని ప్రశ్నించారు.
షామియానాను శుభ్రంచేస్తున్నానన్నాడు భావూ.
పనివాళ్ళచేత పనిచేయించమని నీకు నేను చెబితే
నీవే ఆ పనులు చేస్తున్నావ్ !!అన్నారు.
నీవు పనివాళ్ళతో కలిసి వారితో సమంగా పనిచేస్తే
వాళ్ళు నిన్ను గౌరవించరు సరికదా,
నీవు చెప్పే మాటా వినరు.
దాంతో పనులన్నీ సక్రమంగా జరగవు.
నీవు యం.ఏ. ఎలా పాసయ్యావ్? అని ప్రశ్నించారు.
నీకు పనివాళ్ళతో పనిచేయించడం చాతకాదన్నారు.
మధ్యాహ్నం టీ త్రాగి మెహెరాజాద్ వెళ్ళే ముందు
ఈ ప్రాంతం రాబోయే రోజుల్లో యాత్రికులతో నిండిపోతుందన్నారు.
ఈ ప్రాంతం నా పాద స్పర్శతో పునీతమైందన్నారు.
ఎందరో ప్రేమ-భక్తితో ఇక్కడకు వస్తారన్నారు.
నా భౌతిక దేహం వదిలిన 60 సంవత్సరాల తర్వాత వేలాదిమంది యాత్రికులు ఇక్కడకు వస్తారన్నారు.
ఇక్కడున్న మంచినీటితో కన్నా ఇక్కడి మట్టితో స్నానం చేసి పునీతమవ్వమన్నారు.
భగవంతుడి సమక్షంలో తిరుగుతూ, ఆయన చెంతనేవున్న
మీరెంత అదృష్టవంతులో మీకు అర్థం కావటంలేదన్నారు.
ఆ దరిమిలా మధ్యాహ్నం 1.45కు
మెహెర్‌బాబా ఏరుచ్‌తో కలిసి
మెహెరాజాద్‌కు తిరుగు ప్రయాణమయ్యారు.

**- సశేషం**

## వివాహం

శ్రీ తమ్మిన జగన్నాథరావు, శ్రీమతి పార్వతి దంపతుల పుత్రుడు చి॥ మెహెర్ ఏకాంబరేశ్వర్ వివాహం చి॥ల॥సౌ॥ పుష్పతో ది: 06.05.2015 ఉదయం గం. 9.52 ని.లకు తగరపువలస, రామమందిరంలో జరుపుతున్నట్లు ఆహ్వానం పంపినారు.

# విశాఖలో మెహెర్ ప్రేమిక సహవాస్

26.04.2015న విశాఖపట్నం బాబా సెంటర్‌లో మెహెర్ ప్రేమిక సహవాస్ నిర్వహించడమైంది. శ్రీ ఎల్.వి.ఆర్. మూర్తి కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రేమికులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానాలు ఇచ్చారు.

ఈ సందర్భంగా, బాబా ప్రేమికులు శ్రీ గులాబ్ దాస్ పాంచాల్‌కు సంబంధించిన ఒక సంఘటనపై లఘునాటిక ప్రదర్శన జరిగింది. ఈ నాటిక సారాంశం ఇలా వుంది. గులాబ్‌దాస్ పాంచాల్‌ని (ముంబాయి), బాబా తన సత్య ప్రేమ సందేశాలను వ్యాప్తి చేయమన్నారు. ఆ దంపతులు ఏ రోజు తమ ఇంట్లో కార్యక్రమం ఏర్పాటుచేసి, అ చుట్టు ప్రక్కల వారందర్నీ పిలిచి, ప్రసాదాలు సిద్ధం చేసినా తగినంతమంది ఏనాడూ వచ్చేవారు కాదు. ఇది వారికెంతో బాధకలిగించేది.

ఈ విషయాన్నే వారు బాబాకి చెప్పారు. ఏమయినాసరే ఆ కార్యక్రమాల్ని ఆపకుండా కొనసాగించమన్నారు బాబా! ఒకసారి ఏమయ్యిందంటే, పిలిచినా ఎవరూ రావడం లేదు కదా అని చెప్పి, గులాబ్‌దాస్ పాంచాల్, ఆయన భార్య వారిద్దరికే సరిపడ ప్రసాదం చేసుకొని, వారిద్దరే ఎప్పటిలా కూర్చుని ప్రార్థనలు, అనంతరం పాటలు పాడుకుంటూ ఉన్నారు. ఇంతలో ఒక పిల్లవాడు మురళి వాయిస్తూ వచ్చి కూర్చున్నాడు. ఆ మురళీనాదం విని చుట్టుప్రక్కలవాళ్ళు చాలామంది వచ్చారు.

బాబాని దర్శించుకొన్నారు. ఇంతమందికి ప్రసాద వితరణ ఎలాగా అని మనస్సులో అనుకున్నదే తడవుగా, ఆ పిల్లవాడు నాకేమైనా పెట్టండి, ఆకలిగా ఉందన్నాడు. తయ్యారు చేసిన ఆ కొద్ది ప్రసాదం ఆ పిల్లవాడికి ఇవ్వగానే, అతడు కొంత తిని మిగిలింది అందరికీ పెట్టమన్నాడు. ఆశ్చర్యం! ఆ ప్రసాదం అక్షయమయ్యింది. అందరూ ఎవరి హడావిడిలో వారుండగా ఆ బాలుడు తనమానాన వెళ్ళడం ఎవరూ గమనించలేదు! బాబాయే ఆ బాలుని రూపంలో వచ్చాడని గులాబ్ దంపతులకు అర్థమైంది.

ఈ నాటికలో గులాబ్‌గా శ్రీ కె.ఆర్. కృష్ణ కుమార్, భార్యగా శ్రీమతి కె. తులసి కుమారి, బాలుని రూపంలో వచ్చిన బాబాగా చి॥ కొమారి మెహెర్ చందన చక్కగా నటించారు. శ్రీ వల్లూరి నాగేశ్వరరావు స్వీయరచనలో కొన్ని కవితలను చదివారు. శ్రీ ఐ.వి. సన్యాసిరావు వారి అనుభూతులపై ప్రసంగించారు.

**విశాఖ సెంటరు 44వ వార్షికోత్సవం**

మే 31న విశాఖ బాబా సెంటరు 44వ వార్షికోత్సవం “మెహెర్ నిలయం”లో ఘనంగా ఏర్పాటు చేసామని, ఆ కార్యక్రమానికి ప్రేమికులందరూ తప్పక హాజరుకావలిసిందిగా కార్యదర్శి శ్రీ టి.ఎ. నారాయణ (99664 27565) తెలియజేశారు.

***

# జొన్నాడ బాబా సెంటర్

14.07.2015 నుండి గోదావరి పుష్కరాల ప్రారంభ సందర్భంగా తూర్పుగోదావరి జిల్లా ఆలమూరు మండలం జొన్నాడ గ్రామంలోని అవతార్ మెహెర్‌బాబా ఆధ్యాత్మిక సేవా పరివార్ అంతా కలిసి గోదావరి నది ఒడ్డున ఏర్పాటుచేసే మెహెర్‌బాబా స్టాల్ యందు ఉ.7 నుండి సా. 7 వరకూ ప్రార్ధనలు, సంకీర్తనలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అలాగే, విచ్చేసే యాత్రీకులకు అవతారుని ప్రసాద వితరణ, ఉచితంగా మధ్యాహ్న భోజనాలు, చిన్న పిల్లలకు పాలు వంటి సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తిగల వారందరూ ఈ సర్వమత సమ్మేళనలో పాల్గొనాల్సిందిగా స్థానిక సెంటర్ అధ్యక్షులు శ్రీ తాడి జగన్మోహన్ రెడ్డి, శ్రీ తాడి రామ్మోహన్ రెడ్డి (రాజు) సంయుక్తంగా ఒక ప్రకటనలో తెలిపారు. మరిన్ని వివరాలకు 77020 97886, 94417 10432 సంప్రదించగలరు. పుష్కరాలు 25.07.2015 పుష్కరాలు పూర్తవుతాయి.

# ఖమ్మం బాబా సెంటర్

అవతార్ మెహెర్‌బాబా ఖమ్మం సెంటరు 52వ వార్షికోత్సవము 26.04.2015న సెంటరు ఆవరణలో జరిగినది. ఉదయం 7 గం.లకు బాబా ప్రార్ధనలు, ఆరతి కార్యక్రమముతో ప్రారంభించబడినది. 8 గం.లకు సప్తవర్ణ పతాకావిష్కరణ జరిగినది. ఈ కార్యక్రమములో వరంగల్, తాడేపల్లిగూడెం నుంచి ప్రేమికులు పాల్గొనిరి. భజన సంకీర్తనలతో పాటు బాబా సందేశములు వినిపించిరి. శ్రీ యం. నర్సింహమూర్తి, వరంగల్ బాబా సందేశములు, ప్రేమ సేవా కార్యక్రమములను వివరించిరి. తాడేపల్లి గూడెం నుంచి వచ్చిన శ్రీమతి పద్మ, బాబాను తాను 1954లో 5 సంవత్సరముల వయస్సులో తమ ఇంటికి వచ్చినప్పుడు చూసానన్నారు. మరల 1962లో పూనా సహవాస్‌లో దర్శించుకొన్న విశేషములు తెలిపారు. వరంగల్ నుంచి వచ్చిన శ్రీమతి కమలాదేవి గారు తాను బాబాను దర్శించుకున్న వైనాన్ని వివరించారు. శ్రీ టి. భాస్కరరావు (రిటైర్డ్ ప్రొఫెసర్, కాకతీయ యూనివర్సిటీ) బాబా ప్రపంచ మానవాళికి అందించిన ప్రార్ధనలు, ఆరతి, భగవంతుని ప్రేమించుట ఎట్లు, నా వాంఛితములపై ప్రసంగించి వాటి ప్రాముఖ్యతను వివరించారు. ఖమ్మం ప్రేమికులు శ్రీ ఎల్. వెంకయ్య, వి. కోటేశ్వరరావు బాబా సందేశాలపై ప్రసంగించారు. ఖమ్మం సెంటర్ ట్రస్టు ఛైర్మన్ శ్రీ ఆర్. రామచంద్రయ్య భగవద్వచనములోని అంత:పరిణామ క్రమములో ప్రయాణిస్తూ మానవుడు సప్త భూమికల ద్వారా ఎలా గమ్యస్థానముచేరునో ఛార్టుల ద్వారా ప్రేమికులకు అర్ధమయ్యేట్లు వివరించిరి. ఈ కార్యక్రమము మ. 1 గం.కు ఆరతి కార్యక్రమంతో ముగిసింది.

***

# బాటసారులు

**హజారోం పండిట్, హజారోం షియానే,**
**ఖుదా కీ బాతే, ఖుదా హీ జానే.**

భగవంతునికి సంబంధించిన విషయాలు, వేలాదిమంది పండితులు కానీ,
వేలాదిమంది మేధావులకు కూడా ఏమాత్రం అర్థం కావు. ఇది ఆర్యోక్తి.
అలాగే, మెహెర్‌బాబా మస్తులతో నిర్వహించిన అనేక కార్యక్రమాలు,
ఆ కార్యక్రమాల ఆధ్యాత్మిక ప్రాధాన్యత ఆయనకే తెలుసు.
అన్యులకు అర్థం కాదు. !!
మస్తులు (బాటసారులు) అనేవారు ఆధ్యాత్మికంగా ఉన్నత స్థితిలో వున్న అసాధారణ
మానవులని బాబా పలుమార్లు వివరించారు.
వారికి వారి పరిసరాల గురించి కానీ, వారు చేసే పనుల గురించి కానీ,
మరి వారి దేహం గురించి కూడా ఏమాత్రం పట్టించుకోని స్థితిలో వారుంటారు.
వారు భగవత్ సాన్నిధ్యంలో గడుపుతారు.
ఆ భగవంతుడిలో ఐక్యం కోసం పరితపిస్తారు.
మనబోటివారికి వారు పిచ్చివాళ్ళులాగా కనిపిస్తారు.
ఈ సృష్టి యావత్తూ అనంత ఆనందమైంది.
ఈ అనంత ఆనందంలో మస్తులు మునిగితేలుతుంటారు.
ఆ ఆనందంలో వారి చుట్టుప్రక్కల వున్న సమాజాన్ని ఏమాత్రం పట్టించుకోరు.
ఈ అవతార కాలంలో మెహెర్‌బాబా మస్తులతో గడిపినంతగా
మరి ఇతర అవతారాలలో జరగలేదు.
రాముడు వనవాస సమయంలో,
అలాగే జీసస్ తన పర్యటనలలో కొందరిని కలిసినా,
మస్తులతో మెహెర్‌బాబా జరిపినంత సాంగత్యం
మరి ఇతర అవతారకాలాలలో జరగలేదు.
ఈ స్థూల ప్రపంచంతో సంబంధం లేకుండా వున్న మస్తులు
భగవంతునికి ఒక ఆధ్యాత్మిక ప్రతినిధిగా ఎంతో చురుకుగా సహకరిస్తారు.
సద్గురువు కూడా తన ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణకి
మస్తులను ఒక మాధ్యమంగా ఉపయోగించుకుంటాడు.
మెహెర్‌బాబా మాటల్లో చెప్పాలంటే...
నాకు అత్యంత సంతోషకర విషయం ఏమంటే మస్తులతో సాంగత్యమేనన్నారు.

నేను వారిని ఎంతో ప్రేమిస్తానన్నారు. వారు బలవంతులైన సైనికులతో సమానమన్నారు బాబా. వారు భగవంతునితో, భగవంతునిలో, భగవంతుని కొరకు జీవిస్తారని బాబా వివరించారు. వారు మాయను జయించిన వీరులని బాబా వర్ణించారు.
మస్తులందరికీ నేను మాతృమూర్తినన్నారు. మస్తులనేవారు లేకుంటే భగవంతుడి ఉనికే లేదని బాబా ప్రకటించారు. మస్తులతో సాంగత్యం కోసం, వారి అన్వేషణలో భాగంగా కార్లల్లో, రైళ్ళల్లో, బస్సుల్లో, ఎద్దుల బండ్లపై అలాగే కాలినడకన రాత్రనకా-పగలనకా అనేక కష్టాలకోర్చి కొన్ని వేల మంది మస్తులతో బాబా సాంగత్యం చేశారు. మహారాష్ట్రలోని రాహూరీ గ్రామంలో మస్తుల కోసం 1936లో ఒక ఆశ్రమాన్ని స్థాపించారు.
ఆ తర్వాత అజ్మీర్, జబల్‌పూర్, బెంగళూర్, మెహెరాబాద్, రాంచీ, హైదరాబాద్, సతారా, వంటి ఏడు ప్రాంతాలలో బాబా మస్తు ఆశ్రమాలను నెలకొల్పారు. మస్తులతో బాబా తన ఆంతరంగిక ఆధ్యాత్మిక కార్యక్రమం ముగియగానే ఈ ఏడు ఆశ్రమాలను ఒక్కొక్కటిగా మూసివేశారు.
మస్తులతో బాబా ఎలాంటి కార్యక్రమం నిర్వహించి వుంటారని ఎవరైనా ప్రశ్నిస్తే, అందుకు సరైన జవాబు బాబావద్దనే వుంది.
ఐతే, బైట నుండి చూసేవారికి మాత్రం బాబా స్వయంగా మస్తులకు స్నానం చేయించడం, అన్నం గోరుముద్దలు చేసి నోట్లో పెట్టడం,
వారి మాసిన గడ్డం గీయడం, వారి కాళ్ళు పట్టడం,
వారి మలమూత్రాదులను శుభ్రపరచడం కనిపిస్తుంది. అంతేకాదు,
వారు **కా** అంటే కా, **కీ** అంటే కీ అన్నమాదిరి
వారి నోట్లో మాట పూర్తికాకుండానే వారడిగినవన్నీ
క్షణాల్లో వారికి బాబా చేసిపెట్టినట్లు మాత్రం మనకు తెలుస్తుంది.
1957 వరకూ బాబా మస్తుల అన్వేషణలో నిరంతరం శ్రమించారు.
ఆ దరిమిలా ఎంపిక చేసిన కొంతమందిని మాత్రమే తన వద్దనే వుంచుకుని వారితో తన ఆధ్యాత్మిక కార్యక్రమాలను నిర్వహించారు.
**'THE WAYFARERS'** అనే గ్రంధంలో డా॥ విలియం డాంకిన్ అనే పాశ్చాత్య బాబా ప్రేమికుడు బాబా మస్తులతో జరిపిన కార్యక్రమాలను సమగ్రంగా గ్రంధస్తం చేశాడు. ఆసక్తిగలవారికి మస్తుల గురించి సమస్త సమాచారం ఆ గ్రంధంలో లభిస్తుంది. కాగా, ఈ శీర్షికలో బాబా ఎంతగానో ఇష్టపడిన మహ్మద్‌మస్తు గురించి సంక్షిప్తంగా తెలుసుకుందాం!!

*

# మహ్మద్ మస్తు



ఇతని అసలు పేరు తుకారాం లక్ష్మణ్ చవాన్.
ఈయన స్వగ్రామం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లాలో గల సోనావాడి అనే కుగ్రామం.
పుట్టుకతో కుమ్మరి కులస్తుడు. హిందువు. ఇతను తల్లిదండ్రులకు గల 15 మంది సంతానంలో కడపటివాడు. ఇతనికి భార్యా, ఇద్దరు పిల్లలున్నారు.
తండ్రికి ఇటుకల బట్టీ వుంది. తండ్రికి ఆ వ్యాపారంలో చేదోడువాదోడుగా వుండేవాడు. 1930 ప్రాంతంలో అకస్మాత్తుగా ఆధ్యాత్మిక మత్తులో మునిగిపోయి, అచేతనుడయ్యాడు. సుమారు 2 వారాలు బాహ్య ప్రపంచంతో సంబంధం లేకుండా వున్నాడని చెప్తారు. ఆ తర్వాత స్వల్పంగా కోలుకుని ఇంట్లో ఎవరికీ చెప్పకుండా భార్యా పిల్లలను, తల్లిదండ్రులను అందరినీ వదిలి బొంబాయి చేరుకున్నాడు. చుట్టుప్రక్కలవాళ్ళు ఏదైనా పెడితే తింటూ బ్రతికాడు.
నడిరోడ్డుమీదనే పడుకునేవాడు. అందరికీ భిన్నంగా, వింతగా ప్రవర్తిస్తున్న ఇతడిని చూసి కొందరు ఏదో భగవధ్యానంలో వున్న సన్యాసిగా భావించారు.
వారి వారి సమస్యలు ఏకరువు పెట్టడం మెదలెట్టారు.
వారి ప్రశ్నలకు ఇతగాడిచ్చే జవాబు వారికి నచ్చి వారికి మంచి జరిగినప్పుడు ఇతనికి ప్రతిఫలంగా టీ, మంచి ఆహారం నజరానాగా ఇచ్చేవారు.
ఇదేమాదిరిగా కొన్ని సంవత్సరాలు దిక్కుతోచని రీతిలో తిరుగుతూ, దక్షిణ ముంబాయిలోని ముస్లింలు అధికంగా నివసించే బెండీ బజారులో ఒక టీ షాపు సమీపంలో స్థిరపడ్డాడు.
ఇక్కడి స్థానికులు ఇతడిని **మహ్మద్‌గా** పిలవనారంభించారు.

బాబా మండలి సభ్యుడైన ఖైఖుస్రూ ప్లీడర్ గురించి పాఠకులకి తెలుసు కదా!
ప్లీడరు గారు 1936 ఆగస్టులో **మహ్మద్‌ను చూసి, తన వెంట** బాబావారు నిర్వహిస్తున్న రాహూరి ఆశ్రమానికి తీసుకెళ్ళాడు. రాహూరీ ఆశ్రమంలో మహ్మద్ మస్తుకు బాబా ఎంతో ప్రాముఖ్యత ఇచ్చారు.
అతను ఏది కోరితే అది తక్షణం ఏర్పాటు చేయమని బాబా ఆదేశించారు.
ఆ రోజుల్లో మహ్మద్ మస్తు తీసుకునే ఆహారం ఇలా వుండేది.
అరటి పళ్ళు డజను, రెండు పెద్ద ప్లేట్ల నిండా అన్నం, పప్పు,
ఆరు ఉల్లిగడ్డలు, పన్నెండు చపాతీలు, పన్నెండు పేట్లు నిండుగా ఉడకబెట్టిన కూరలు,
ఉదయాన్నే ఆరు కప్పుల టీ, తిరిగి మధ్యాహ్నం మరో ఆరు కప్పుల టీ మహ్మద్ సేవించేవాడు. పగటిపూటంతా మహ్మద్ రాహూరీ ఆశ్రమం గేటు ముందర కూర్చొనేవాడు. తన దగ్గరకు ఎవరు వచ్చినా వారిపై ఉమ్మి వేసేవాడు.
ఎంతటివారినైనా గట్టిగా దూషించేవాడు.
బాబా మండలి సభ్యుడైన బైదుల్
మహ్మద్ మస్తుకు సేవకుడిగా వుండేవాడు.
రాత్రిపూట బైదుల్‌ని క్షణం సేపు నిద్రపోనీకుండా
ఏదో ఒకటి కావాలని విసిగించేవాడు.
రాహూరీ ఆశ్రమం మూసివేశాక మహ్మద్ మస్తుని మెహెరాబాద్‌కి తరలించారు.
ఇక్కడ తెల్లవారుఝామున నాలుగు గంటలకే లేచి
టీ పెట్టడం కోసం పొయ్యి వెలిగించి ఆశ్రమవాసులు నానా యాతనా పడుతుంటే,
మహ్మద్ తన కాలకృత్యాలు తీర్చడంలో సహాయం చేయమని కేకలు వేసేవాడు.
ఉదయం 6 నుండి 8 దాకా
తీరిగ్గా నిలబడి దంతధావనం చేసేవాడు.
తిరిగి స్నానం చేయించాల్సి వచ్చినప్పుడు
బాబాతోపాటు ముగ్గురు మనుష్యులు అవసరమయ్యేవారు.
పగటిపూట తన చేతివేళ్ళతో నేలపై ఏదో రాస్తూ
మట్టి నేలపై గుంటలు చేసేవాడు.
నేల వైపు వంగి ఏదో ఒకటి ఏరుతుండే వాడు.
కొన్ని గంటలసేపు అలా విసుగులేకుండా ఏరుతుండేవాడు.
ఏం చేస్తున్నావయ్యా? అని అడిగితే
నాకు కావాల్సిన దాని కోసం వెతుకుతున్నానేవాడు.
మహ్మద్ బాబాని **దాదా** అని పిలిచేవాడు.
బాబాని అమితంగా ప్రేమించేవాడు.

మహ్మద్‌ని రాహూరీ ఆశ్రమానికి తీసుకొచ్చిన సమయంలో
అతను మూడు - నాలుగు భూమికల్లో వున్నాడనేవారు.
బాబా సమక్షంలోకి వచ్చాక మహ్మద్ ఐదో భూమికలోకి చేరుకున్నాడని
బాబానే ప్రకటించారు.
అలాగే, అతను ఈ జన్మలో ఐదో భూమిక దాటలేదని కూడా బాబా ప్రకటించారు.
బాబాకు కూడా మహ్మద్ మస్తు అంటే అమితమైన ప్రేమ.
మెహెరాబాద్‌లో ఆయన జీవితాంతం ఒక ప్రత్యేక గదిని ఏర్పాటు చేశారు.
1937 వేసవిలో బాబా ఫ్రాన్స్ దేశానికి వెళ్ళారు.
బాబా అక్కడికి చేరుకున్న కొద్దిరోజులకే
మెహెరాబాద్ నుండి మహ్మద్‌ని అక్కడికి తీసుకురమ్మనమని కేబుల్ పంపారు.
పిచ్చివాడిలాంటి భగవతోన్నతుడైన మస్తుని ఫ్రాన్స్ దేశానికి తీసుకెళ్ళడం
ఎంత సులభమో పాఠకులు ఊహించగలరు.
పాసస్‌పోర్టు, వీసా పొందే సమయంలో అక్కడి అధికారులతో మహ్మద్ ఎలా
ప్రవర్తిస్తాడోనని బాబావారి శిష్యులు గాభరా పడ్డారు.
ఐతే, బాబానే స్వయంగా తన శిష్యులైన ఆదీ సీనియర్, సరోష్ ఇరానీలకు
ఒక చక్కని సలహా ఇచ్చారు.
అదేమంటే మహ్మద్ పిచ్చివాడని,
ఆ వ్యాధి నయం చేయించడం కోసమే
ఫ్రాన్స్‌కి తీసుకెళుతున్నామని పాస్‌పోర్ట్ అధికారులకు చెప్పమన్నారు.
ఆ మేరకు పాస్‌పోర్ట్ సులభంగానే లభించింది.
ఫ్రాన్స్ చేరుకున్న మహ్మద్‌ని చూసి బాబా పరమానందభరితులయ్యారు.
ఒకవేళ మహ్మద్ ఫ్రాన్స్‌కి రాలేని పక్షంలో
తనతోపాటు వచ్చినవారందరినీ
ఒక్కొక్కరినే తిరిగి ఇండియాకి పంపించేయాలనుకున్నానన్నారు బాబా.
1937 అక్టోబరు 9న మహ్మద్ ఫ్రాన్స్‌కి చేరుకున్నాక
ప్రతిరోజు బాబా అతనితో గంటలసేపు కూర్చునేవారు.
బాబా స్వయంగా అతనికి స్నానం చేయించి భోజనం తినిపించి
తన ఆధ్యాత్మిక కార్యక్రమం నిర్వహించారు.
స్నానం చేయించాక అతనికి దుస్తులు తొడగటం అదొక పెద్ద ప్రహసనంగా వుండేది.
అలాగే కాళ్ళకు చెప్పులు తొడగడం కూడా ఎంతో కష్టంగా వుండేది.
స్నానం చేయించడం, దుస్తులు తొడగడం, కాళ్ళకు చెప్పులు తొడగడం
ఇవన్నీ చంటిపిల్లాడికంటే మిన్నగా వుండేది.

ఎన్నో రకాలుగా మారం చేసేవాడు.
కాళ్ళకు చెప్పులు తొడుగుతుంటే విదిలించేసుకునేవాడు.
దుస్తులు తొడుగుతుంటే దూరంగా గిరవాటేసేవాడు.
గట్టిగా కేకలు వేసేవాడు, అరిచేవాడు. కోపంతో కొట్టడానికి వచ్చేవాడు.
ఇవన్నీ పచ్చి నిజాలు. వినడానికి, చదవడానికి ఆశ్చర్యంగా వుండవచ్చు.
ఇంత జరుగుతున్నా మహ్మద్‌కి బాబా అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు.
మహ్మద్ అడిగినవన్నీ తూ.చ. తప్పక అమలు చేయాలన్నది బాబావారి ఆదేశం.
మహ్మద్ మస్తు జర్మనీ దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాడని బాబా మండలికి చెప్పారు.
కాబట్టే అతడిని ఫ్రాన్స్‌కు పిలిపించానని బాబా అన్నారు.
అతనితో తను జరుపుతున్న ఆధ్యాత్మిక కార్యక్రమాలు
అత్యంత ప్రధానమైనవన్నారు. అత్యంత ప్రాముఖ్యమైనవని
బాబా తన మండలిని హెచ్చరించారు.
మహ్మద్‌తో జరిగిన ఒక సరస సంభాషణ ఇలా వుంది.
ఒకసారి బాబా సరదాగా అతనితో మాట్లాడుతూ
అతని భార్య (ఉత్తుత్తునే) ఆ మర్నాడు వస్తుందని అన్నారు.
అది మెదలుకుని " **నా భార్య ఎప్పుడొస్తుందంటూ"** సతాయించడం ప్రారంభించాడు.
ఆమె రావడానికి మరో 10 రోజులు పడుతుందని మండలివారు వాయిదా వేసేవారు.
ఆమె గత నెల రోజులుగా ఉపవాసం ఉందని, నీరసంగా వుందని చెప్పేవారు.
ఏదేమైనా ఆమెను తీసుకురమ్మంటే తీసుకొస్తామనేవారు.
వద్దులే!! ఆమెకు మంచిగా భోజనం పెట్టి, ఆమె ఆరోగ్యం కుదుట పడ్డాకే
తీసుకురమ్మనేవాడు మహ్మద్.
ఇలా రెండు సంవత్సరాలు గడచిపోయాయి.
కానీ భార్య మాత్రం రాలేదు.
ఒక రోజున ఏడుస్తూ,
దాదా!! నీవు ఇలా అబద్దాలు చెబుతావని నేను ఊహించలేదన్నాడు.
నా భార్య వస్తుందని నీవే చెప్పావ్.
ఏదీ ఎక్కడ? అని ప్రశ్నించాడు.
కళ్ళనీళ్ళ పర్యంతమయ్యాడు.
బాబా అన్నారు కదా, మహ్మద్ కళ్ళనీళ్ళు పెట్టింది భార్య రానందుకు కాదు,
తాను అబద్ధం చెప్పినందుకన్నారు.
ఆ దరిమిలా ఒకరోజున ఒక ముసలి స్త్రీని తీసుకొచ్చారు.
ఆమె చంకలో ఒక చంటిపిల్లవాడిని వుంచారు.

ఆమె కళ్ళు కనపడకుండా గంతలు కట్టారు.
ఆ తర్వాత, మహ్మద్ మస్తు ఎదుటకు తీసుకు వచ్చారు.
నా ఆరోగ్యం బాగా లేదు.
ఆరోగ్యం కుదుటపడ్డాక తప్పక నీ దగ్గరకు వస్తానని చెప్పమని
ఆమెకు ముందుగానే బాబా వారి శిష్యులు హెచ్చరించారు.
ఆమె మహ్మద్ ఎదుటకు రాగానే ఆ మాదిరిగానే చెప్పింది.
ఆమెను చూస్తూనే మహ్మద్ ఓ! నీవు ముసలిదానివి అయిపోయావే !! అన్నాడు.
బాబా తనమాట నిలబెట్టుకున్నాడని అన్నాడు.
ఆ ముసలి అవ్వ తన పాత్రను చక్కగా పోషించింది.
కొద్దిరోజులు పోయాక బాబాతో మహ్మద్ ఇలా అన్నాడు.
నాకు ఇక నా భార్యను చూడాలని లేదు.
ఆమె ఎప్పుడూ ఏదో ఒక రోగంతో మూలుగుతూ ఉంది.
నా భార్య బదులు నాకు నెమలిని ఇవ్వండి అంటూ,
నెమలి మాదిరిగా గెంతుతూ సంబర పడ్డాడు.
బాబా జబల్‌పూర్ మస్తుల ఆశ్రమంలో ఉన్నప్పుడు
కొంతకాలం ఏరుచ్ మహ్మద్‌కు సహాయకుడిగా వున్నాడు.
ఒకరోజున బఠానీలతో కూర వండమంటే ఏరుచ్ తల్లి గైమాయి
బఠానీలు కూర వండలేదని మరేదో కూర తెచ్చిపెట్టిందని
బాబాను చూడగానే గట్టిగా కేకలు వేశాడు.
బాబా గైమాయిని పిలిపించమన్నారు.
ఆమె చెప్పింది చేయడంలేదని మహ్మద్ బాబా ఎదుటనే గట్టిగా అరిచాడు.
బాబా కూడా మహ్మద్ చెప్పింది చేయనందుకు గైమాయిపై కోపంతో
చెయెత్తగానే, వద్దు ...వద్దు... ఆమెను కొట్ట వద్దు
నేను ఏదోమాదిరిగా సర్దుకుపోతాలే అని
ఆమెను వదిలిపెట్టమని అన్నాడు.
ఆ మాదిరిగా మహ్మద్ సంతోషం కోసం
ఏ పని చేయడానికైనా వెనుకంజ వేసేవారు కాదు బాబా.
1969 జనవరి 30న మండలి సభ్యుడైన సిద్దూని పిలిచి
పాద్రీ ఎక్కడకు వెళ్ళాడని మహ్మద్ మస్తు అడిగాడు.
పాద్రీని ఒక వారం రోజులు వుండేలాగా మెహెరాజాద్‌కు బాబా రమ్మనమన్నారని అక్కడకు వెళ్ళాడని సిద్దూ చెప్పాడు. ఐతే, పాద్రీ రేపు వచ్చేస్తాడని మహ్మద్ మస్తు చాలా స్పష్టంగా సిద్దూతో అన్నాడు. వారం రోజులు వుండేలాగా పాద్రీని పిలిచారని

చెప్పినా, లేదు...లేదు... **దాదానే** ...మెహెరాబాద్‌కు రేపు వస్తున్నాడు.
గుస్తాద్‌జీని చేరుకుంటున్నాడు అని అన్నాడు.
గుస్తాద్‌జీ 1958లో బాబాలో ఐక్యమయ్యాడు.
ఆ రోజుల్లో వయస్సురీత్యా పెద్దవాడైన మహ్మద్ మాట స్పష్టంగా వుండేది కాదు.
కాని, సిద్దూతో చెప్పిన ఈ మాటలు చాలా స్పష్టంగా వున్నాయని సిద్దూ చెప్పాడు.
బాబా సమాధి అయిన తర్వాత సుమారు 34 సంవత్సరాలు మెహెరాబాద్‌లోని మండలి హాలు సమీపంలో మహ్మద్ మస్తు వున్నాడు.
మహ్మద్ మస్తుని ఈ తరంలో బాబా ప్రేమికులు దాదాపు చాలామంది చూసేవున్నారు.
నిండు నూరేళ్ళు జీవించిన మహ్మద్ మస్తు,
2003 జూన్ 17న బాబాలో ఐక్యమయ్యాడు.
దిగువ మెహెరాబాద్‌లో మహ్మద్ మస్తు సమాధిని నేడు మనం దర్శించవచ్చు.
దాదా అని పిలిచే బాబా గురించి మాట్లాడుతూ మహ్మద్ మస్తు
ఎప్పుడూ ఇలా అనేవాడు.
దాదా భగవంతుడు.
దాదా నా గురువు.
దాదా ఇచ్ఛపైనే ప్రతిఒక్కటీ ఆధారపడి వుంది.
దాదా కరుణామయుడు.
దాదా ప్రేమ సాగరుడు అని
మహ్మద్ మస్తు తరచు బాబాని స్మరిస్తూ వుండేవాడు.

*

## బాబాలో ఐక్యం



పార్వతీపురం సెంటర్ బాబా ప్రేమికులు సో॥ నీలాపు మోహనరావుగారు 24.04.2015న బాబాలో ఐక్యమయ్యారు. వీరి ఆత్మకు శాంతి కలగాలని పి.వి.పి. సెంటర్‌లో రెండు నిముషాలు మౌనం పాటించినట్లు శ్రీ బాలక్రిష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సంతాపము సెంటరు తరఫున తెలియజేసుకుంటున్నామన్నారు. వీరు చాలా సంవత్సరాల నుండి బాబా కార్యక్రమములలో పాల్గొన్న ధన్యజీవని సెంటర్ సభ్యులు ఆయన సేవలను కొనియాడారు.



# అవతార్ మెహెర్‌బాబా జీవితచరిత్ర

ఆంగ్ల మూలం: - భావూ కల్చూరీ, లార్డ్ మెహెర్,
వాల్యూం-3 (1925-29) - తెలుగుసేత: మల్లాది రామారావ్, న్యూఢిల్లీ

*(గత సంచిక తరువాయి)*

పర్షియా యాత్రకి సుముహూర్తం దగ్గర పడింది.
తొమ్మిదింబావుకి కారు కదిలింది బొంబాయి రేవు కేసి.
ఈ ఆధునిక రథసారధి కాకాబారియా.
ఆవేళ సెప్టెంబరు 20వ తేదీ. అది 1929వ సంవత్సరం.
ముందు సీట్లో బాబావారు కూర్చొన్నారు. వెనుక సీట్లో సర్దుకొన్నారు మండలివారు.
ఇంటి దగ్గర నుంచి ఓడరేవు పెద్ద దూరం లేదు.
అయినా ఉదయం కావటంతో పెద్దగా వాహనాల రద్దీ లేదు రోడ్డు మీద.
అందుకని కాకాబారియా కారు త్వరగానే చేరింది ఓడరేవుకి.
అప్పటికే స్థానిక ప్రేమికులు ఎందరో అక్కడ నిలబడి వున్నారు.
ప్రభువు రాకకోసం ఎదురుచూస్తూ, పూనా నుంచీ, నగర్ నుంచి కూడా వచ్చారు
చాలామంది. బాబావారు ఎక్కవలసిన ఓడ పేరు ఎస్.ఎస్. వెరసోవా.
అందరికంటే ఎక్కువ ఆనందంగా కన్పిస్తోంది షిరీన్ మాత.
తాతా ముత్తాతలు పుట్టిన దేశానికి వెడుతున్నాడు మేర్వానుడు.
ఈమాట తలుచుకొంటేనే మనస్సు ఆనందంతో ఉప్పొంగిపోయింది ఆమెకి.
కట్టుబట్టలతో జొరాష్ట్రియన్లు ఎందరో ఇండియాకి వచ్చారు. తలదాచుకొన్నారు.
షిరీన్ పూర్వీకులు కూడా అలా వచ్చినవారే.
ఆమె భర్త షెరియార్జీ మాత్రం భగవదన్వేషణలో ఇండియాకి వచ్చాడు.
భగవంతుడికే జన్మనిచ్చిన తండ్రి అయ్యాడు.
ఇప్పుడు ఆ భగవంతుడు ఆది అవతారమైన జొరాస్ట్రుని జన్మస్థలానికి వెడుతున్నాడు.
ఇంతకంటే ఇంకేమి కావాలి ఆ దొడ్డ తల్లికి.
ఆనందభాష్పాల మధ్య తనయుడిని అక్కున చేర్చుకొంది.
జాగ్రత్తగా వెళ్ళిరా చిట్టినాన్న అంటూ, పూలదండ వేసింది మెడలో.
మనసారా ఆశీర్వదించింది.
గుల్మాయి కూడా బాబావారికి పూలదండ వేసింది,

మీ ప్రయాణం శుభప్రదమగుగాక అంది.
ఇంతలో సైరన్ మ్రోగింది అంటే నౌక బయలుదేరడానికి రెడీ అన్నమాట.
వెళ్ళివస్తానమ్మా అన్నారు బాబా. జయంగా వెళ్ళిరా నాయనా అంది తల్లి.
భక్త జనం జయజయ ధ్వానాలు పలికారు.
కొందరు పూల గుచ్ఛాలు ఇస్తే, ఇంకొందరు పూల మాలలు వేసి తమ ఆనందం వ్యక్తం చేశారు. అందరికీ శుభాశీస్సులు చెప్పి బాబావారు నౌక ఎక్కారు.
అప్పటకే మండలివారు నౌకలో పైకి చేరారు.
నౌక కదుల్తుంటే, ఒడ్డున వున్న ప్రేమికులకి దు:ఖం పొంగుకు వచ్చింది.
మళ్ళీ స్వామి వచ్చే వరకు తప్పదా ఎడబాటు అని కొట్టుకుపోయారు.
మా ఊపిరి, మా ప్రాణం, మా సర్వస్వం అంతా బాబావారే,
ప్రభుని చూడకుండా వుండాలా, అయ్యో అని క్రుంగిపోయారు.
అంత దు:ఖంలోనూ బాబావారికి చేయివూపటం మరచిపోలేదు.
మమ్మల్ని మరచిపోకు దేవదేవా.
మమ్మల్ని మరచిపోనీకు స్వామీ అన్న సందేశం పంపుతున్నారా అనిపించింది చూస్తున్నవాళ్ళకి. అదొక మూగ సందేశం.
మాటలకందని మనోవేదన. నర-నారాయణుల మధ్య వెలసిన బంధం అది.
కులమనీ, మతమనీ వివక్ష లేదు. ధనిక, పేద విభజనా లేదు ఆ బంధానికి.
అది ప్రేమ బంధం.
అందుకనే కామోసు దేవునిపై అప్పుడప్పుడు కారాలు మిరియాలు నూరే దేవతలకి కూడా కళ్ళు చమర్చాయి.
ఔరా! మనస్సుకి వినిపించే మౌనప్రేమ ఎంత మధురమైనది అని ముక్కున వేలు వేసుకున్నారు.
ఇంతకీ కబుర్ల మధ్య ఓ మాట మరచిపోయాము.
బాబావారి ఓడ బయలుదేరే సరికి రాత్రి 11 గంటలు అయింది.
ఇంత ఆలస్యం దేనికి. ఎప్పుడో ప్రొద్దున వస్తే,
రాత్రి వరకూ ఆలస్యం చేస్తారా అని కోప్పడకండి.
విదేశీయానం నౌకలో అయినా, విమానంలో అయినా ఒక్కటే.
అందరి పాస్‌పోర్టులు, వీసాలు చూడాలి.
సామాన్లు తనిఖీ చేశాకనే ఓడపైకి పంపించేది.
ఎన్నో సరుకు సరంజామా కూడా పంపుతారు కదా,
వాటినీ తనిఖీ చేసి నౌక నెక్కించాలి.
మరి ఈ తనిఖీలకి టైం పడుతుంది కదా.

సరిగ్గా ఇలానే జరిగింది ఆవేళ కూడా.
రైల్లో ఫస్ట్‌క్లాస్, ఏసీ స్లీపర్‌క్లాస్, రెండవ తరగతి పెట్టెలు వున్నట్లే,
ఓడపై కూడా డబ్బువుంటే ఎంతో సుఖంగా ప్రయాణం చేయవచ్చు.
పేదలకి డెక్‌పైనే సుఖం అనిపిస్తే, డబ్బున్న మారాజులకి కాబిన్‌లు దొరుకుతాయి.
ఈ కాబిన్‌లలో కొన్ని విశేష వసతులున్నవి కూడా వుంటాయి.
యావత్తు విశ్వ సంపదా తమసొత్తు అయినా, సామాన్యునిలా జీవించడం బాబావారికే చెల్లింది. అదీ బాబావారి దైవీ కార్యక్రమంలో భాగంగానే మన మధ్య సామాన్యునిలా కనిపిస్తున్నారన్న సంగతి ఎన్నిసార్లు చెప్పినా బుర్రకెక్కదు మనకి.
అందుకనే తరచు తప్పులో కాలువేస్తుంటాము.
అడుసు త్రొక్కనేల, కాలు కడగనేల అన్న సామెత గుర్తువున్నా మన అలవాట్లు మారవు సరికదా, పశ్చాతాప ప్రార్ధనతో ప్రభుని బుజ్జగించవచ్చని అనుకొంటాము.
ఒకసారా రెండుసార్లా!
అనేకసార్లు ఈ మన ప్రకృతి ప్రభువుకి తెలియదని కాదు.
అన్నీ తెలిసి కూడా సరే ఈ సారికి క్షమిస్తాననడం,
ఆయనకీ అలా అనే వరకూ వదలకపోవడం మనకీ ఓ అలవాటు.
సరే ఈ గ్రహపాటు గురించి ఎందుకు ప్రస్తావించాల్సివచ్చిందీ అంటే,
అందుకూ ఓ కారణం వుంది.
వెరసోవా ప్రయాణికుల్లో ఓ ప్రముఖ వ్యక్తి – బుర్జోర్ జోషి.
బాగా డబ్బున్నవాడు. నాసిక్ నివాసి. వ్యాపారి.
ఛాన్జీతో కొద్దో గొప్పో పరిచయం వుంది.
మెహెర్‌బాబా అంటే ఓ ఋషి ఆయన దృష్టిలో.
అందుకనే బాబావారు సామాన్యునిలా ప్రయాణం చేస్తుంటే ఇదేమి వింత అనిపించింది.
బహుశా క్యాబిన్ టిక్కెట్టుకి డబ్బు సర్దుబాటు కాలేదేమో,
ఆ మాత్రం డబ్బు నేను పెట్టలేనా అనుకొన్నాడు.
ఆ మాటే ఛాన్జీ చెవిని వేశాడు.
'బాబావారికి స్పెషల్ క్యాబిన్ ఏర్పాటు చేస్తాను.
కాస్తంత సుఖంగా ప్రయాణం చేస్తారు అన్నాడు.
ఛాన్జీ ఖంగు తిన్నాడు.
వెంటనే తేరుకొని అసలు సంగతి చెప్పాడు.
బాబావారు ఎప్పుడూ సామాన్యుడిలానే ప్రయాణం చేస్తారన్నాడు'.
'నిజంగానా?' అని అడిగాడు బుర్జోర్ జోషి గారు.
'అక్షరాలా నిజం' అని బదులు చెప్పాడు మన ఛాన్జీ.

అబద్ధం చెప్పాల్సిన పనేముంది.
బాబావారి పద్ధతే అంత అని చెప్పాడు.
ఛాన్జీ మాటలు నమ్మబుద్ధి కాలేదు మన నాసిక్ వ్యాపారికి.
ఏదో దాస్తున్నాడు ఛాన్జీ అనుకొన్నాడు.
ఎకాయెకి బాబావారినే అడిగితే పోలా!
మధ్యవర్తులతో పనేమిటి నాకు అనిపించింది.
వెంటనే బాబావారి వద్దకి వెళ్ళాడు.
మీవంటి సత్పురుషులు డెక్‌పై ప్రయాణం చేయకూడదు. క్యాబిన్ వుంది.
వూ అంటే క్యాబిన్ ఏర్పాటు చేస్తాను, మీకు మీ శిష్యులకీ.
ఫస్ట్‌క్లాస్‌లో ప్రయాణం చేయవచ్చు హాయిగా, సుఖంగా అన్నాడు.
బాబావారు అతని మాటలకి పకపకా నవ్వారు.
నా కెందుకు క్యాబిన్ అన్నారు. నాకు ఇక్కడ డెక్‌పైనే హాయిగా వుందన్నారు.
తమవంటి ఫకీరులు నిరుపేదల మధ్యనే వుంటారన్నారు.
మన పార్శీ వ్యాపారికి ఏం చెప్పాలో తెలియలేదు.
బాబావారి మాట అతని నోటికి తాళం వేసింది.
బుర్రమాత్రం పనిచేయటం మానలేదు. అందుకని ఓ కొత్త ఐడియా వచ్చింది.
ఈ సత్పురుషుడు నా మాట వినడు.
ఇటు ప్రక్కనుంచి నరక లేకపోతే, అటు ప్రక్కనుంచి నరకమంటారు.
అందుకని నేను చేయలేని పని షిప్ కాప్టెన్ ద్వారా చేద్దాం అనుకొన్నాడు.
పేరూ, వూరున్నవారికి కెప్టెన్ అతిథి మర్యాదలు చేయటం ఓ రివాజు.
తరుచు నౌకాయానం చేసే బుర్జోర్‌జోషి గారికి తెలుసు ఈ సంగతి.
ఖర్చు నేను భరిస్తానంటే, అతగాడు ఏర్పాట్లు చేయక పోతాడా అనుకొన్నాడు.
వెంటనే కెప్టెన్‌ని కలిశాడు.
తన మనస్సులో మాట చెప్పాడు. మీమాట కాదంటానా అన్నాడు అతగాడు.
నాపేరు బయటపెట్టకండి.
నేనీ ఏర్పాటు చేసేనని తెలిస్తే బాబావారికి కోపంరావచ్చు అన్నాడు జోషి గారు.
అబ్బే! ఎందుకు చెప్తాను మీపేరు మీరు వద్దన్నాక అన్నాడు.
బాబావారి అవసరాలని నేను దగ్గరుండి చుస్తానన్నాడు.
ఇదే నాకు కావాల్సింది అన్నాడు మన నాసిక్ వ్యాపారి గారు.
చెప్పినట్లే చేశాడు కెప్టెన్ గారు. బాబావారికి ఏ లోటూ రాకుండా
చక్కటి ఏర్పాట్లు చేశాడు.
మంచి గది ఏర్పాటు చేశాడు.

బాబావారికి ఆ మాటే చెప్పాడు.
'అబ్బే! నాకెందుకు ఇవన్నీ' అని అతని మాట తోసిపుచ్చారు బాబా.
ఈ సంగతి తెలిసి మన పార్శీ వ్యాపారి హతాశుడయ్యాడు.
రోజుకి రెండు మూడుసార్లయినా బాబావారిని కలవటం,
మీరు క్యాబిన్‌లోకి మారండి అని విన్నవించుకోవడం,
బాబావారు నాకెందుకయ్యా క్యాబిన్ అనటం మామూలు అయిపోయింది.
అంతగా అడుగుతున్నాడుగా, అతగాడి మాట కాదనటందేనికి అని మండలివారికి అనిపించేది. అయితే ఈమాట పెదవి దాటి బయటకి రాలేదు.
ఎందుకంటే, బాబావారి సంగతి వాళ్ళకి తెలుసు కనుక.
పాపం జోషిగారు అని జాలిపడడం తప్ప, ఇంకేమి చేస్తారు వాళ్ళు.
అయితే ఒక రోజున ఏమయిందీ,
"సరే ఇంతగా చెప్తున్నారు కాబట్టి క్యాబిన్‌కివెడతాను" అన్నారు బాబా.
మన జోషిగారు ఎగిరి గంతేశాడు.
ఫస్ట్‌క్లాస్ క్యాబిన్ వద్దు. సెకండ్ క్లాస్ క్యాబిన్‌కి మారుతాను అందులో ఏ.సి. వుండదు అన్నారు. ఇదే ఓ మహాభాగ్యం అనుకొన్నాడు నాసిక్‌వాసి.
ఇంతకీ గమ్మత్తు ఏమిటి అంటే జోషిగారు బాబావారిని నాసిక్‌లో ఎప్పుడూ కలవలేదు.
బాబాగారి పేరు విన్నారంతే.
ప్రభు దర్శన భాగ్యం దొరికింది పర్షియా యాత్ర పేరుచెప్పి.
ప్రభువుకి సేవచేసే మహద్భాగ్యం కూడా దొరికింది.
అదీ కాకతాళీయంగా.
దొరుకునా ఇటువంటి సేవ అని పొంగిపోయాడు.
బాబావారు తరచు ఆఘూ ఆలీ ప్రస్తావన తెస్తున్నారు
ఆ చిన్నారి ఏం చేస్తున్నాడో,
ఎలా వున్నాడో అంటున్నారు.
ఆఘూ ఫోటోని ముద్దు పెట్టుకొంటున్నారు.
ఎందుకో, ఏమో ఎవరూ అడగలేదు. ప్రభువు చెప్పలేదు.
బాబావారేమి చేసినా దానికో అర్థం వుంటుంది.
ఆ విశేషం ఈ వేళ కాకపోతే రేపు తప్పక తెలుస్తుంది.
ఒక్కోసారి తామే చెప్పవచ్చా సంగతి.
ఆ ఘడియ వచ్చేవరకూ ఎదురు చూడాల్సిందే తప్ప, ఏమిటి, ఏమయింది అని అడగకూడదు. ఇదొక నియమం, మండలివారికి తెలిసిన పచ్చి నిజం.
అందువల్ల ఆఘూ ఆలీ ప్రస్తావన చిదంబర రహస్యమే ప్రస్తుతానికి.

సముద్ర ప్రయాణం అందరికీ పడదు.
కొందరికి వాంతులు వస్తే, మరి కొందరికి జ్వరమే రావచ్చు.
ఇదే జరిగింది మారుతీ పటేల్‌కీ, బువాసాహెబ్‌కీ.
ఇద్దరూ మంచం ఎక్కారు.
డాక్టర్లు వచ్చి చూస్తున్నారు రోజూ.
సెప్టెంబరు 20వ తేదీ రాత్రి 11 గంటలకి బొంబాయిలో బయలుదేరింది ఓడ.
ఈ సంగతి పాఠకులకి తెలుసు.
21వ తేదీ రాత్రి 11 గంటలకి కరాచీ చేరింది.
బాబావారి మేనత్త బానూ మాసి, పీలామాయి హద్మజ్ద్,
నగరమేయరు జెంషెడ్ ఎన్.ఆర్ మెహెర్ ప్రభృతులు
బాబావారికి సాదర స్వాగతం పలికారు.
బానూ మాసికి ఇద్దరు కొడుకులు.
మేర్వాన్, హోమీ. మెహెరాశ్రమం స్కూల్లో చదివారు.
మేమూ వస్తామని తల్లి వెనుక వచ్చారు. బాబావారికి అభివాదం చేశారు.
వాళ్ళని ముద్దాడారు ప్రభువు.
'మా ఇంటికి రా, బాబా', అన్నది పిలామయి.
నీ కోరిక కాదంటానా అన్నాడు దేవదేవుడు.
బువాసాహెబ్‌నీ, విష్ణునీ తమతో రమ్మనారు.
అందరూ పిలామాయి ఇంటికి చేరేసరికి రాత్రి పదకొండున్నర అయింది.
అప్పటికే ఎందరో భక్తులు అక్కడ ఎదురు చూస్తున్నారు.
అందరికీ దర్శనం ఇచ్చారు మెహెర్ ప్రభువు.
నిస్వార్థ సేవ చేస్తున్నావయ్యా అని జంషెడ్జీ మెహెత్ భుజం తట్టారు.
అతగాడు పొంగిపోయాడు. దివ్య ప్రేమ గురించి వివరించారు.
ఈ ఉవాచ ముగిసేసరికి రెండున్నర అయింది. అలనాటి దివ్య ప్రేమ ఉవాచ
ఇలనాటికీ ఎప్పటికీ వినదగ్గది. ఆచరించదగ్గది.
పూజ అంటే ఏమిటో, పూజ ఎలా చేయాలో బాబావారు వివరించారు.
పూజ అంటే మంత్రోచ్ఛరణ కాదన్నారు.
నిజమైన ఆరాధన మనస్సులోనే. మంత్రాలు వల్లెవేయడంలో వుండదు అన్నారు.
పూజలు, పునస్కారాలు, తదితర కర్మకాండలు దాటి వెళ్ళాలి.
అప్పుడే ఆధ్యాత్మిక మార్గానికి వెళ్ళగలుగుతారు అన్నారు.
"ఆధ్యాత్మిక మార్గంలో అడుగుపెట్టాలంటే పూజా, పునస్కారాలను దాటాలి.
బుద్ధి ద్వారా సత్యాన్ని తెలుసుకోలేరు.

కానీ సత్యం గురించి అణుమాత్రమైన తెలుసుకోడానికి సుముఖంగా లేరు,
నేటి ప్రజానీకం" అన్నారు.
ప్రపంచంలో వున్న అస్తవ్యస్త పరిస్థితులకి కారణం మనస్సు అని స్పష్టం చేశారు.
మనస్సుని జయించిన వాడు సర్వాన్ని జయిస్తాడు.
అటువంటి వ్యక్తి నిజమైన వీరుడు అని బాబావారు పేర్కొన్నారు.
బానూమాసికి ఆపరేషన్ అవసరమట. ఈ సంగతి బాబావారికి తెలిసింది.
ఆలస్యం దేనికి ఆపరేషన్ చేయించు, ఇక్కడ కరాచీలోనే, అని మేర్వాన్‌కి చెప్పారు.
మీతో వుంటాను బాబా అన్నాడు హోమీ.
అలాగే అన్నారు.
అంటే రమ్మన, వద్దనా? ఈ ప్రశ్న ఓ శేష ప్రశ్న పాపం హోమీకి.
'పర్షియా నుంచి తిరిగి వస్తాను కదా, అప్పుడు గుర్తుచేయి', అన్నారు.
అంటే నీ ఆశ అడియాస కాదులే అని అన్నట్లా?
ఏమో ఎవరికి తెలుసు బాబావారి మాటల అంతరార్థం.
బహుశా ఆశతో ఎదురు చూడు అని అనుకోవాలేమో?.
కరాచీ నుంచి 22వ తేదీన కదిలింది వెరసోవా ఓడ.
ఎందరో ప్రేమికులు బాబావారికి వీడ్కోలు చెప్పారు.
అందరికీ తమ ఆశీస్సులు ఇచ్చారు ప్రభువు.
మేయరు మెహెతా గురించి ప్రస్తావించాము కదా.
ఆయన గాంధీ మహాత్మునికి మంచి మిత్రుడు.
ఈ కరాచీ మెహెతాగారి ద్వారానే బాబావారి నామం గాంధీగారి చెవిని పడింది.
మెహెతాగారి పేరు చెప్పే, గాంధీ మహాత్ముడు మెహెర్ ప్రభువుని కలిశారు.
పర్షియా చేరే వరకూ బాబావారు డెక్‌పైకి రాలేదు.
తమ క్యాబిన్‌లోనే కూర్చొన్నారు.
బాబావారితో పాటు మండలివారు కూడా క్యాబిన్‌లోనే వుండిపోయారు.
ఇంజనుకు దగ్గరగా వుండటం వల్లనో,
ఎయిర్ కండిషన్ లేకపోవటం వల్లనో ఏమో కొలిమిలో వున్నట్లే వుంది.
చెమటతో తడిసి ముద్దయిపోతున్నారు అందరూ.
అయినా సరే డెక్‌పైకి రానన్నారు బాబావారు "ఏంచేస్తాం!
ఇది నా అదృష్టం" అన్నారు.
ఈ ఉడికిపోతున్న క్యాబిన్‌లోనే వుండాలని రాసి వుంది.
నాకు ఇదే బాగుంది", అని వ్యాఖ్యానించారు.

**– సశేషం**

# రెండు సహవాస్‌లు


మల్లాది రామారావు

2015 ఏప్రిల్ నెలలో రెండు సహవాస్‌లు జరిగాయి. భారతదేశం నడిబొడ్డున వున్న నాగపూర్‌లో ఏప్రిల్ 15, 16 తారీఖుల్లో, దేశాగ్రభాగాన వున్న కాశ్మీర్‌లో ఏప్రిల్ 26, 27, 28 తేదీల్లో బాబా ప్రేమికులు కలిశారు. యుగావతారుని నామ సంకీర్తన చేశారు. మెహెరావతారుడు నడిచిన బాటలో అడుగులు వేశారు. పునీతులమయ్యామని పొంగిపోయారు. బాబా చరిత్రలో నాగపూర్‌కి ఓ విశిష్టత వుంది. 1915 నుండి 1953 వరకూ మొత్తం ఎనిమిదిసార్లు బాబావారు నాగపూర్ సందర్శించారు. మెహెరునికి నీడలా వున్న ఏరుచ్ మహాశయుడినీ, నీ మాట నా నోట పలకాల అని కలం పట్టిన భావూ కల్చూరినీ గాలం వేసి పట్టుకొన్నది నాగపూర్‌లోనే. మండలివారు కాకపోయినా మండలిలో కలిసిపోయిన బాలనాటు బాబాని దర్శించిందీ ఇక్కడే. తత్వవేత్తగా పేరు తెచ్చుకొని, మస్తుగా మారి తరించిన సి.డి. దేశ్‌ముఖ్ నాగపూర్‌వాడే. ఇలానే ఎందరో ప్రముఖులు బాబా ఒడిలోకి అడుగుపెట్టారు నాగపూర్‌లో. బాబావారికీ ఈ మహానగరమంటే ఎంతో ఇష్టం. ఎందుకు ఇష్టం అని అడగకండి.

బాబావారి మాటలని వినడం తప్ప, భాష్యం చెప్పే ప్రయత్నం మనకి తగదని ప్రభువు ఎన్నోసార్లు చెప్పకనే చెప్పారు కదా. బాబావారికి నాగపూర్ అంటే ఇష్టమనటానికి తార్కాణం ఏమిటి అని అడిగితే చాలానే వున్నాయి కారణాలు అనాలి.

మన తెలుగువారిని చాలమందిని బాబావారు నాగపూర్‌లో చదువుకోమన్నారు. వారు చెప్పినట్లే చేశారు. ఆయన సేవలో పండిపోయారు.

బాబావారు నాగపూర్‌ని 1915 ఏప్రిల్ 15న సందర్శించారు.

అప్పటికే బాబాజాన్ బాబాని ముద్దాడింది. అవతార వ్యక్తీకరణకి తెరతొలిగించింది. సాయిబాబా, నారాయణ మహరాజ్‌లు దర్శనం పర్వదిగార్‌గా ప్రస్తుతింపబడటం జరిగాయి. ఇంకా ఉపాసనీని కలవలేదు.

బహుశా అందుకు రంగం సిద్ధం చేస్తూ తాజుద్దీన్ దర్శనం జరిగింది.

తాజుద్దీన్ కోపంతో వున్నాడా సమయంలో.

ఇప్పుడు వెళ్ళవద్దు ఆయన దగ్గరకి. కొంచెం కోపం తగ్గాక వెళ్ళండి అని, తాజుద్దీన్




శిష్యులు మేర్వాన్‌ని హెచ్చరించారట. వాళ్ళ మాటని లెక్కచేయలేదు సరికదా, నా కోసం ఎదురు చూస్తున్నాడు తాజుద్దీన్ అంటూ, మేర్వాన్ ఆ సద్గురువు సన్నిధికి వెళ్ళాడు. అగ్నిగోళంలా భగ భగా మండుతున్న తాజుద్దీన్ ఒక్కసారిగా శాంతమూర్తి అయ్యాడు. మేర్వాన్‌ని అక్కున చేర్చుకొన్నాడు. ముద్దాడాడు. పూలతో అభిషేకం చేశాడు. మేర్వాన్ అప్పటికి మౌనావతారుడు కాదు.

కానీ హజరత్ మౌన బాబా అంటూ తాజుద్దీన్ ప్రస్తుతించాడు మెహెరుని.

ఆ ప్రకారంగా మెహెరుని అవతార కిరీటంతో సత్కరించాడని చెప్తారు పెద్దలు.

మెహెర్‌బాబా – తాజుద్దీన్‌ల రెండవ సమావేశం మరో నాలుగేళ్ళకి అంటే 1919 వ సంవత్సరంలో జరిగింది. ఫలానా తేదీన కలిశారు అని తెలియదు.

బహుశా నవంబరు – డిసెంబరు నెలల్లో కలిసి వుండవచ్చు అంటారు స్థానికులు.

అప్పట్లో తాజుద్దీన్ నాగపూర్‌లో ఉండటంలేదు. మకాం వాకీ షరీఫ్‌కి మారింది.

ఈ ఊరు నాగపూర్‌కి ఓ ఇరవై కిలోమీటర్లు దూరంలో నాగపూర్ – భోపాల్ రహదారికి దగ్గరగా వుంది. అప్పుడూ ఇప్పుడూ ఇది కుగ్రామమే. తాజుద్దీన్ సేద తీరేవారు ఇక్కడ. అనారోగ్యంతో వున్నవారికి మందులు ఇచ్చేవారు. ఏమిటా మందు అంటే అది మట్టి కావచ్చు, విభూతి కావచ్చు. మరేదైనా కావచ్చు. హోమియోపతి పంచదార గుళికలు కావచ్చు. తాజుద్దీన్ ఏమి ఇచ్చినా కళ్ళకద్దుకొని శ్రద్ధగా నోటిలో వేసుకోవడం, హమ్మయ్య, ఇప్పుడు మాకు బాగుంది అనటం అంతా ఓ తమాషాగా వుండేది అంటారు

ఆ వైనం తెలిసిన పెద్దలు.
సరే ఇంతకీ 1919 నాటి సమావేశం కథలోకి వస్తే, తాజుద్దీన్‌ని కలిసిరా అని సదాశివ పటేల్‌కి చెప్పారు బాబా.
ఉపాసనీ శిష్యులు ఓ ఇద్దరు – ముగ్గురిని తీసుకువెళ్ళమన్నారు.
తాజుద్దీన్‌కి పువ్వులు, పళ్ళు సమర్పించమన్నారు. సదాశివ సరేనన్నాడు.
వాకీ షరీఫ్‌కి వెళ్ళాడు. అరె, ఇప్పుడే తాజుద్దీన్ బయటికి వెళ్ళేరు.
కొంచెం పెందలాడే వస్తే బాగుండేది అన్నారు అక్కడివారు.
మర్నాడు ఓ గంట ముందర చేరాడు అక్కడికి. అప్పటికే తాజుద్దీన్ ఇంకోచోటికి వెళ్ళాడు. సదాశివ్‌కి ప్రాణం చివుక్కుమంది. మేర్వాన్ చెప్పారని వచ్చాను.
ఈ మహానుభావుడు ఏమిటి, చిక్కడు దొరకడులాగా మాయమవుతున్నాడని అనుకొన్నాడు.
ఇలా ఒకరోజా, రెండు రోజులా, నాలుగు రోజులు ఇలాగే జరిగింది.
ఇహ వుండబట్టలేక బాబావారికి చెప్పాడు.
ప్రభూ! నా వల్ల కాదు తాజుద్దీన్ దగ్గరకు వెళ్ళడం. క్షమించండి.
ఇంకోసారి ఎప్పుడయినా వెడతాను అన్నాడు. మేర్వాన్ చిరునవ్వు నవ్వాడు.
అంత సహనం లేకపోతే ఎలాగ అన్నారు. సద్గురు దర్శనానికి కొంచెం ఓపిక పట్టాలి అని సర్దిచెప్పి, ఇంకోసారి వెళ్ళిరాకూడదూ అన్నారు.
ప్రభువు ఆజ్ఞ ధిక్కరించలేడు కదా, వెళ్ళాడు వాకీ షరీఫ్‌కి.
సద్గురువు కనిపించాడు. ఆశీర్వదించాడు. నాలుగు రోజులుగా వస్తున్నావట.
నేను కనిపించకపోవటంతో నిరాశతో వెనక్కి వెళ్ళిపోతున్నావట.
నాకు చెప్పారు మా వాళ్ళు. ఏం చేయమంటావు చెప్పు.
స్వర్గధామం నుంచి సుగంధ పువ్వు పిలుస్తోంది రా రమ్మని వెళ్ళక తప్పలేదు.
మిమ్మల్ని వాకీకి పంపుతూనే నాకు కబురు పెట్టేవారు.
మీరు ఇటు వచ్చేవాళ్ళు నేను అటువెళ్ళేవాడిని అని తాజుద్దీన్ బాబా చెప్తుంటే, ఔరా! అనుకొన్నారు అందరూ. ఇంతటి మహత్తరమైన పుణ్యక్షేత్రం వాకీ షరీఫ్.
తాజుద్దీన్ సమాధి నాగపూర్‌లో వుంది. ఇక్కడ వాకీలో మాత్రం ఆయన దర్గా వుంది.
ఆ దర్గా ధర్మకర్తలు హిందువులు. ఇటీవలికాలం వరకూ మెహెరుని ఫోటో వుండేదిట దర్గాలో. ఇప్పుడు లేదు. కారణం తెలీదు. ఎవరిని అడిగినా మాకు తెలీదు అన్నవారే.
పూనాలో హజరత్ బాబాజాన్ సమాధిలో బాబా ఫోటో వుండేది.
ఇప్పుడు లేదు. దర్గాకి సున్నాలు వేస్తున్నామని, ఫోటో తీసేరుట.
మళ్ళీ పెట్టలేదు. బాబా సోదరి మణి గారు, ఆ దరిమిలా భావూ కల్చూరీ గారు ఎంతగా ప్రయత్నించినా ఆ పాత ఫోటో మళ్ళా కనబడలేదు క్రొత్త ఫోటో పెట్టే వీలూ చిక్కలేదు. ఇలా ఎందుకు జరుగుతుంది? ఇదొక చిక్కు ప్రశ్న.

చిక్కుముడి విప్పగలవారు ఎవరూలేరు. సరే ప్రస్తుత కథాంశంలోకి వస్తే,
ఎప్పటిలానే నాగపూర్ సహవాస్‌కి తెలుగువారు అధిక సంఖ్యలో హాజరయ్యారు.
కామారెడ్డివారు అయితే పెద్ద బస్సులో తరలి వచ్చారు.
15వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు శతాబ్ది మహోత్సవం ఘనంగా జరిగింది.
మెహెరాబాద్ నుంచి ట్రస్టీ మెహెర్‌నాథ్ కల్చూరి ప్రత్యేక అతిధిగా విచ్చేశారు.
స్థల మహత్యం వివరించారు. నాగపూర్‌తో బాబావారి అనుబంధాన్ని గుర్తుచేశారు.
మెహెర్‌బాబా– తాజుద్దీన్‌ల సమావేశం ఎలా జరిగిందో చెప్పారు.
“మేర్వాన్, బెహ్రం టాంగాలో వాకీ షరీఫ్‌కి వెళ్ళారు.
అప్పుడు సభలో వున్నారు తాజుద్దీన్. మేర్వాన్ వస్తుంటే తాజుద్దీన్ చూశారు.
వెంటనే లేచి నుంచున్నారు. కాళ్ళలో సత్తువ లేదా అనిపించింది చూస్తున్నవాళ్ళకి.
కొంచెం కాళ్ళు మడతపడిపోయాయి. అయినాసరే మేర్వాన్‌కి ఎదురు వెళ్ళి స్వాగతం
పలికాడు. గులాబీ పువ్వు ఇచ్చాడు. ఇద్దరి కళ్ళు కలిశాయి.
అలా కాసేపు ఒకరినొకరు చూస్తూ నిలబడ్డారు, మౌనంగా మేర్వాన్ చెక్కిళ్ళని గులాబీతో
సుతారంగా నిమిరాడు. నుదిటిపై కూడా గులాబీనుంచాడు.
అంటే ఇహ శలవు అన్నట్లు గులాబీతో చేయి వూపాడు.
మేర్వాన్ తిరుగు ముఖం పట్టారు.
ఓ గులాబీ, నా గులాబీ అని తాజుద్దీన్ అనటం అక్కడ నాగపూర్ చేరిన మేర్వాన్,
“తాజ్, తాజ్, నా తాజ్” అనడం ఒక్కసారే జరిగాయి అని అలనాటి సంఘటనని
కళ్ళకి కట్టినట్లు మెహెర్‌నాథ్ వర్ణించారు.
ఆవేల్టి వక్తలు – హమీర్‌పూర్‌కి చెందిన విద్యావేత్త పి.కె. నిగమ్,
ఝూన్సీకి చెందిన ఆయుర్వేద వైద్యుడు దూబే గారు.
ఈ ముగ్గురు వక్తలు ఏప్రిల్ 16న అంగేవాడులో బాబా సందేశాలపై ప్రసంగించారు.
ఈవూరు నాగపూర్ జిల్లాలో సావనీర్ తాలూకాలో కొండల మధ్యన ఉంది.
అడవి దారిని వెళ్ళాల్సిందే ఇప్పటికీ.
కోలార్ నది దాటితే కానీ అంగావాడిలో అడుగుపెట్టలేము.
కోలార్ వర్షాకాలం పొంగిపొర్లుతుంది.
బాబావారు ఈ వాగుని దాటడానికి ఎడ్లబండి ఎక్కారు.
ఇప్పటికీ ఆ బండిని పదిలంగా భద్రపరిచారు.
గుడికట్టి బాబావారి విగ్రహం ప్రతిష్ఠించారు.
ఏప్రిల్ 16 పండగ దినం స్థానికులకి.
బాబావారి రాకకి తీపిగుర్తు ఏప్రిల్ 16వ తేదీ.
తమ సన్నిధికి వస్తే జన్మజన్మల కష్టాలు గట్టు ఎక్కుతాయని

బాబావారు ఓ తూరి అన్నారు. ఈమాట అక్షర సత్యమని అంగావాడిలో మనకి తెలుస్తుంది. ఆవూరు చేరడానికి పడిన కష్టాన్ని ఇట్టే మర్చిపోతాము.

**నాటి వక్తల సందేశం**

అవతారుని సైనికులం మనం. ఆత్మస్తుతి పరనింద మనసొత్తు కాకూడదు.
బాబా కొంగుని గట్టిగా పట్టుకోవాలి. బాబావారి సైనికుల్లాగా అంటే,
బాబావారు అమ్మా... నేను సైన్యంలో చేరతాను అన్నారట.
షిరీన్ మాయి ఒప్పుకోలేదు.
ఆమెకి ఏమి తెలుసు. అవతారుడు ఆరంగావ్‌నే తన నివాసంగా, సైనికపురిగా మార్చుకొంటాడని నిగమ్‌గారు అంటారు.
అలనాటి సైనిక స్థావరం ఇలనాడు మెహెరాబాద్‌కి మారింది.
అందుకనే మనమంతా మెహెరుని సైనికులం అంటాడు ఈ హమీర్‌పూరు వాసి.
నిజమే సుమా!! అనిపించింది ఆయన మాట విన్నవాళ్ళకి.
నిగమ్‌గారు మళ్ళీ మనకి కాశ్మీర్ సహవాస్‌లోనూ కనిపించారు.
బాబావారికి కాశ్మీర్ లోయకీ ఎంతో సంబంధం వుందన్నారు.
రెండు కొండలు ఢీ కొంటాయి. ఇందకు కారణం వాటి మధ్యలో వున్న ఒక చిన్న కొండ అని బాబావారు 1944 లోనే శెలవిచ్చారు.
దరిమిలా 1950 దశకంలో హమీర్‌పుర్ వచ్చినప్పుడు అక్కడి మస్తు బాబావారితో ఏకాంతంగా మాట్లాడాడు. కాశ్మీర్ సమస్యకి పరిష్కారం దొరుకుతుందా అని అడిగాడట.
బాబావారు ఏమి చెప్పారో అతగాడు ఎవరికీ చెప్పలేదు అని కాశ్మీర్ సహవాస్‌కి నాందీ ప్రస్తావన చేశారు నిగమ్‌గారు.
వృత్తిరీత్యా పంతులు గారు కావటంతో నాల్గయిదు నిమిషాల సేపు పాఠం చెప్పినట్లు ఎన్నో సంగతుల్ని చెప్పాడీయన ఏకధాటిన.

**ఆ విషయములు క్లుప్తంగా:**

బాబావారు కాశ్మీరు ఐదుసార్లు సందర్శించారు.
మొదటి యాత్ర 1929 జూలై నెల 30వ తేదీన.
కరాచీ నుంచి ఇప్పటి పాక్ ఆక్రమిత కాశ్మీర్ మీదుగా శ్రీనగర్‌కి వచ్చారు బాబా.
అప్పట్లో శ్రీనగర్‌కి దూరంగా విసిరినట్లు వున్న హర్వాన్ కొండపై ఏకాంతవాసం చేశారు.
చాలారోజులు ఏకాంతవాసం చేస్తామన్నారు కానీ నాలుగు రోజుల్లోనే అనుకొన్న పని పూర్తిచేసి తిరుగు ప్రయాణం చేశారు. ఇప్పుడు హార్వాన్ శ్రీనగర్‌లో కలిసిపోయింది. హార్వాన్ కొండపైకి ఎక్కాలంటే కుర్రకారుకే సాధ్యం, అరవయ్యో ఏటలో పడ్డవారికి తగని పని అన్నారు. అందువల్ల ఈ కొండ క్రింద నుంచే అంజలి ఘటించాము సహవాసీయులం అందరం. బాబావారు డాల్‌లేక్ పడవలో వున్నారు ఒకటి రెండు

రోజులు. అవి గూడు పడవలు. ఎక్కినవారు ఎక్కారు. తిరిగారు.
లేనివారు ఒడ్డునుండే ఆనందించారు.
హార్వాన్‌ని హరివన్ అని కూడా అంటారట.
ఇక్కడ శైవమతం ప్రభసిల్లింది.
బౌద్ధ మతం కొత్త ఊపిరినిచ్చింది విసిగి వేసారిన మనవాళ్ళకి.
శిలువ వేయబడిన దరిమిలా ఏసుప్రభువుని కాశ్మీర్‌కి తీసుకువచ్చారని ఆయన శిష్యులు అంటారు. శిలువపై ఏసు చనిపోలేదు. నిర్వికల్ప సమాధిలోకి వెళ్ళాడు.
మూడు రోజుల తర్వాత శరీరంలో చలనం కనిపించింది.
వెంటనే శిష్యులు ఏసుని శిలవపై నుంచి దింపి, మారు వేషంలో భారతదేశానికి తీసుకువచ్చారు. కాశ్మీర్‌లో చాలాకాలం వున్నాడు. ఇక్కడే మరణిస్తే, సమాధి చేశారు అని బాబావారు శెలవిచ్చారు 1925లో.
తాజుద్దీన్ బాబాకి నివాళినర్పించిన దరిమిలా ఆగస్టు 23న చెప్పారీ సంగతి నాగపూర్‌లో.
క్రైస్తవ పెద్దలు ఈ సంగతి ఒప్పుకోరు కానీ, హార్వాన్ కొండపైనే ఏసు సమాధి వుందని బాబావారు పేర్కొన్నారు.
ఆ జాగ ఫలానా చోట వుందని చూపించలేదు. ఎందువల్లనో మరి.
ఈ సంగతి అలా వుంచితే కాశ్మీర్ ఆధ్యాత్మికంగా అత్యున్నత ప్రాంతమని మన మల్కాజిగిరి ఆంజనేయులుగారు అంటారు. శ్రీనగర్‌లో శక్తి పీఠం వుంది.
దక్షిణాదిన శివ మతం ప్రాచుర్యానికి రాకపూర్వమే శైవం ప్రభసిల్లింది కాశ్మీర్‌లో.
శ్రీనగర్ నుంచి పహల్‌గాంకు వెడ్తుంటే అనంతనాగ్ అన్న ఊరు సమీపంలో 'మార్తాండ్' గుడి వుంది. ఇది సూర్య దేవాలయం. నిత్యం పూజలు జరుగుతాయి.
ఈ గుడిని బాబావారు దర్శించారు. ఓ ఇద్దరు మస్తుల్ని కలిసారు.
వాళ్ళతో ఏకాంతంగా తమ విశ్వ కార్యక్రమాన్ని జరిపారు.
అందుకనే కాశ్మీర్ సహవాసీయులు, మార్తాండ్‌ని సన్నిధానంలో అవతారునికి ప్రార్ధనలు చేశారు. ఆరతి పట్టారు. అక్కడికి పహల్‌గాం దగ్గరే. అదొక మంచు ప్రదేశం.
చుట్టూరా మంచు కొండలు. దూరంగా అమర్‌నాథ్ కొండ కనిపిస్తుంది.
కాలినడకన దూరమే కానీ ఎండాకాలం అమరనాథ్ గుడి తలుపులు తెరిచినప్పుడు వెళ్ళవచ్చు అక్కడికి. బాబావారు పహల్‌గాం దర్శించారు.
అలానే మరో పర్యటక కేంద్రం గుల్మార్గ్.
మా బృందం అందరూ కాకపోయినా కొందరు వెళ్ళొచ్చారు గుల్మార్గ్‌కి.
1930లో ఒకసారి, 1933లో మరోసారీ బాబావారు హర్వాన్ సందర్శించారు.
1933 ఏప్రిల్ నెలలో పాశ్చాత్య ప్రేమికులు బాబావారి వెంట హార్వాన్ గ్రామం దర్శించారని స్థల పురాణం. అక్కడి ఆధ్యాత్మిక వాతావరణం వాళ్ళని మంత్రముగ్ధుల్ని చేసిందట.

మస్తు కార్యక్రమంలో భాగంగా బాబావారు కాశ్మీర్ 1943 సెప్టెంబరు 2న వచ్చారు. తొమ్మిది వరకూ వున్నారు డాల్‌లేక్ ఎదురుగా అప్పట్లో వున్న శామ్ హోటల్‌లో బస చేశారు. ఈ వివరాలన్నీ మనకి లార్డ్ మెహెర్‌లోను, బాటసారుల పుస్తకాల్లో దొరుకుతాయి. కాబట్టి వాటి ప్రస్తావన చేయటం లేదు.

అటు నాగపూర్, ఇటు హార్వాన్ సహవాస్ కార్యక్రమాలకి స్ఫూర్తినిచ్చిందీ, దగ్గర వుండి నడిపించిందీ అక్షరాలా తెలుగువాడు. పేరు నరేంద్ర ప్రసాద్. బాబా పిలిచాడని తప్పించుకొనేవాడిని ఆయన కన్పిస్తే. ఎప్పుడు కనిపించినా బాబా ఫలానా ఊళ్ళో, ఫలానా కార్యక్రమం చేశారు. మనం అక్కడికి వెడితే బాగుంటుంది అనటం ప్రసాద్‌కి అలవాటు. ప్రసాద్ ఉవాచని పెడచెవిని పెట్టడం నాకలవాటు. కానీ ప్రసాద్‌లో ఈ తపన రేకెత్తిస్తున్నది బాబానే అన్న సంగతి తెలియటానికి హార్వాన్ యాత్ర దోహదం చేసింది.

కాశ్మీర్‌లో బాబా ప్రేమికులు లేరు మనకి తెలిసి.

అయినా పట్టుదలతో బాబాపై భారంవేసి ముందుకు వెళ్ళి ఓ ఇద్దరితో పరిచయం చేసుకొన్నాడు ప్రసాద్. ఆ ఇద్దరూ బాబా సమాధి దర్శించడం, హార్వాన్ సహవాస్‌కి సంసిద్ధులు కావడం ఏదో కలలాగా జరిగిపోయినై అంటాడు.

ఉత్తర కశ్మీరులో బాబా మస్తు యాత్రని స్మరిస్తూ సహవాస్‌ని నిర్వహించిన మన మిత్రుడు, మంజిల్-ఈ-మీమ్ రోజుల్ని అందరికీ గుర్తుచేశారు.

అలాగే, సూరత్ సహవాస్‌తో జ్ఞాపకాలని మనస్సులో నిక్షిప్తం చేయించాడు.

ఇవన్నీ ఒక ఎత్తు, కాశ్మీర్ - హార్వాన్ సహవాస్ ఇంకో ఎత్తు.

మందీమార్బలం ఉన్నచోటనే సహవాస్ కార్యక్రమ నిర్వహణ కష్టమయిన ఈ రోజుల్లో ఓ ఇద్దరు మిత్రుల సహకారంతో ఐదు రోజుల కార్యక్రమ నిర్వహణ సాహసం అనాలి. అయితే ప్రభుని నమ్మినవారికి దుస్సాధ్యమన్నది వుండదన్నది హార్వాన్ సహవాస్ నిరూపించింది.

జమ్మూ నుంచి శ్రీనగర్ వెడుతూ 25వ తేదీ మధ్యాహ్నం భోజనం కోసం ఆగితే అక్కడ టీవిలో విన్నవార్త, నేపాల్‌లో భయంకర భూకంపం.

విజయవాడలో సహా అనేక ఊళ్ళలో భూకంపనలు.

ఉత్తర కాశీ సహవాస్ సమయంలోనూ భూకంపం వచ్చిందట.

సహవాస్ ముగించుకొని హరిద్వార్ చేరాక ఆ ప్రాంతం ఊగిపోయింది.

అపార నష్టం జరిగింది. మరి ఇప్పుడు హార్వాన్ సహవాస్‌కి వెడుతుంటేనే భూకంపం వార్త వినిపించింది. నేపాల్ బహు దూరం కాశ్మీర్‌కి. కాబట్టి, ఆ ప్రకంపనలు మాకు వినబడలేదు, కనబడలేదు. కానీ ఏమి ఈ కథ మెహెరీశా అని మాత్రం అడగక మానలేదు. ఎప్పటిలాగా మౌనమే సమాధానమయింది.



# బాబాలో ఐక్యం

బాబా ప్రేమికులు నిజామాబాద్ వాస్తవ్యులు శ్రీ గుజ్జుల శంకర్ రెడ్డి (74) రిటైర్డ్ యం.ఆర్.ఓ., 19.04.2015 రాత్రి 10 గం.లకు బాబాలో ఐక్యమయ్యారు. ఆయన చివరి శ్వాస వరకు నిరంతరం బాబాను స్మరిస్తూ వున్నారు. వీరు గత 38 సంవత్సరాలుగా బాబా అమరతిధి వేడుకలలో పాలొంటటున్నారని సెంటర్ ప్రేమికులు తెలిపారు.

# రచనలకు ఆహ్వానం

బాబా సందేశాలపై, మీకు నచ్చిన అంశాలపై మీ రచనలకు ఆహ్వానిస్తున్నాం.
మీ ప్రాంతాల్లో జరిగే సహవాస్ కార్యక్రమ వివరాలను కూడా
మా చిరునామాకు పంపండి.
మీ సమాచారం మాకు ప్రతి నెలా 5వ తేదీ లోగా మాకు అందేలాగా పంపవల్సింది.

**మా చిరునామా..**
ఎడిటర్, బాబాస్ హౌస్, గోదావరి గార్డెన్స్,
ప్లాట్ నంబరు 32, యాప్రాల్,
సికింద్రాబాద్ - 500 087. ఫోన్ 99595 53218.
**ఇ-మెయిల్.** malladisukku@gmail.com.

# జీవిత సభ్యుల వివరాలు

గత కొన్ని నెలలుగా జీవిత సభ్యుల వివరాలను జిల్లాలవారీగా
పత్రికలోని చివరాఖరి పేజీలలో..35-37లలో ప్రచురిస్తున్నాం.
ప్రతి నెలా ఒకటి లేదా రెండు జిల్లాల జీవిత సభ్యుల వివరాలు ప్రచురిస్తున్నాం.
**దీని ఉద్దేశ్యం** 1. సంబంధితులందరికీ వివరాలు తెలియజేయడం.
2. తప్పొప్పులు పొరబాటున దొర్లినట్లైతే సరిదిద్దుబాటు కోసం ప్రచురిస్తాం.
దయచేసి మీ పేర్లు సరిచూసుకోండి.
ఫిర్యాదులుంటే దయచేసి వెంటనే తెలియజేయగలరు.

# మల్కాజిగిరి బాబా సెంటర్

మల్కాజిగిరి బాబా సెంటర్ ఇప్పటిదాకా అద్దె భవనాలలో నిర్వహిస్తున్నారు. కాగా ఎంతో కాలంలో సెంటర్‌కు సొంత భవనం కొనుగోలు చేయాలని చేస్తున్న ప్రయత్నాలు నేటికి ఒక కొలిక్కి వచ్చాయి. మల్కాజిగిరి – ఆనంద్‌బాగ్ పరిసరాలలో – ఒక చక్కని భవనాన్ని స్థానిక సెంటర్ నిర్వహాకులు ఎంపిక చేశారు. 2015 మే నెలాఖరుకు సుమారు రూ. 16.50 లక్షలతో రిజిస్ట్రేషన్ ఏర్పాట్లు చేశారు. మరో నాల్గు లక్షల చిన్నపాటి మరమ్మత్తులకు నిధులు అవసరమవుతాయ. మొత్తం వెరశి ఈ భవనాన్ని సుమారు 20 లక్షల వ్యయంతో స్థానిక సెంటర్ నిర్వాహకులు తమ పరపతిని వినియోగించి కొనుగోలుకు తగిన ఏర్పాట్లు చేశారు. కాగా బాబా ప్రేమికులు ఈ విషయమై తమవంతుగా సహాయం అందించ వల్సిందిగా శ్రీ కె. జగన్నాద్, కోశాధికారి కోరుతున్నారు. **ఆన్‌లైన్ అకౌంట్‌లో పంపగోరువారు:**

1. Society of Avatar Meher Baba Malkajgiri Center,
**Canara Bank,** Malkajgiri Branch,
**S.B A/c No: 108910103577, IFSC Code: CNRB0001089.**
2. Avatar Meher Baba Malkajgiri Center,
**Bank of India,** Malkajgiri Branch,
**S.B. A/c No: 860210110012664, IFSC Code: BKID0008602.**

పంపవల్సిందిగా కోరుతున్నారు.

**మరిన్ని వివరాలకు:** శ్రీ ఎస్.వి. ఆంజనేయులు, ప్రెసిడెంట్, 040–27110440,
శ్రీ వి.ఆర్.కె. శాస్త్రి, వైస్ ప్రెసిడెంట్, 9849242284,
శ్రీ పి.పి. హరి, సెక్రటరీ, 08341746377,
శ్రీ కె. జగనాధరావు, కోశాధికారి, 9490950014 సంప్రదించగలరు.

# వివాహం

శ్రీమతి సొల్లేటి లలితాదేవి, శ్రీ సొల్లేటి నాగేశ్వరాచారి పుత్రిక చి॥ల॥సౌ॥ లహరి (శాంభవి) వివాహం చి॥ రవికిరణ్ చారితో ది: 22.04.2015 బుధవారం ఉ. 10.48 ని.లకు శ్రీ సీతారమ కళ్యాణ మండపము శ్రీ రామాలయము, కుకట్‌పల్లి, హైదరాబాద్‌లో జరిపినట్లు బాబా ప్రేమికులు తెలిపారు.

**జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు - 2002 - మే 2015 వరకు, కర్నాటక**

| | | | |
|---|---|---|---|
| 1 | Rajagopal A.N. | Sept, 02 | 1000 |
| 2 | Meherlatha G. | Oct, 02 | 1000 |
| 3 | Aruna Narender S. | Sept, 03 | 1000 |
| 4 | Ramamohana Rao N. | Nov, 03 | 1000 |
| 5 | Mohan Rao P. | Nov, 03 | 1000 |
| 6 | Chandra Shekar B.S. | Feb, 04 | 1020 |
| 7 | Chalapathi N. Pavagadha | July, 04 | 1000 |
| 8 | Suseelamma .T | Feb, 05 | 1000 |
| 9 | Udutu Vijay Kumar, | Feb, 06 | 1000 |
| 10 | Valluru Gandhi | Jun, 06 | 1000 |
| 11 | B.V.Ramana Murthy | Dec, 06 | 1000 |
| 12 | Bikkina Venkata Rao, Raichur | Aug,07 | 1000 |
| 13 | Suneel Kumar, SEDAM | Sept, 07 | 1000 |
| 14 | B. Bhaskar Rao, Bangalore | June, 08 | 1000 |
| 15 | Pingali Ramalakshmi, Bangolore | July, 08 | 1000 |
| 16 | V.B.Geetha jayaraman, Bangalore | July, 08 | 1000 |
| 17 | Maddineni Meher Praveen, Bangalore | May, 09 | 1000 |
| 18 | M. Pattabhi Chowdary , Sindhanur | Feb. 11 | 1000 |
| 19 | Jai Baba Photographar, Sindhanur | Feb. 11 | 1000 |
| 20 | Meher Durga, Bangalore | June,11 | 1000 |
| 21 | Y. Srinivas Kumar, Sindhanur | Feb, 12 | 1000 |
| 22 | Venugopala Reddy, Benglore | Feb, 12 | 1000 |
| 23 | P. Sriharsha, Benglore | Sep, 12 | 1000 |
| 24 | Kandi Rama Krishna | July, 13 | 1000 |

**జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు**
**2002 - మే 2015 వరకు, కర్నాటక**

| | | | |
|---|---|---|---|
| 25 | Prasad D.V.R.L. | Nov, 03 | 500 |
| | Prasad DVRL | Apr, 05 | 500 |
| 26 | Narayanmurthy E.V.S.N. | Apr, 05 | 500 |
| | Murthy E.V.S.N. | Nov, 03 | 500 |
| 27 | R.Subramanyam, Pavagada, Tumkur | Feb.08 | 500 |
| | R. Subramanyam, Pavagada | Feb, 09 | 500 |

**జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు**
**2002 - మే 2015 వరకు, కర్నాటక**

| | | | |
|---|---|---|---|
| 1 | Chalapathi N. P.N.Manjula, Pavagadh | Feb, 03 | 250 |
| 2 | Ragavendra prasad, Pawgada | Feb, 12 | 500 |
| 3 | Akkamma, Pavagada | Feb, 13 | 500 |
| 4 | R. Uma Devi, Bengalore | Feb, 13 | 500 |
| 5 | Y. Jhansi | Oct - 13 | 500 |

## జీవిత సభ్యత్వం పొందినవారి వివరములు

**2002 – మే 2015 వరకు, ఖమ్మం జిల్లా**

| | | | |
|---|---|---|---|
| 1 | Krishnamacharyulu V. | Dec, 03 | 1000 |
| 2 | Dayanand Rao P. | Dec, 03 | 1000 |
| 3 | Mohan Rao D. Kammam | Dec, 03 | 1000 |
| 4 | Dr. Rajani Raj Kumar, transfer to Nalgonda | Nov, 04 | 1000 |
| 5 | Vishnu Vardhan Rao, New Palvancha | Sept, 07 | 1000 |
| 6 | S. Sreenath Reddy, Bhadrachalam | Feb.08 | 1000 |
| 7 | M. Simhareddy | Feb. 11 | 1000 |
| 8 | L. Venkateswar Rao | April, 13 | 1000 |

## జీవిత సభ్యత్వం రెండు దఫాలుగా చెల్లించినవారి వివరములు

**2002 – మే 2015 వరకు, ఖమ్మం జిల్లా**

| | | | |
|---|---|---|---|
| 9 | Jaganmohan Rao, | Feb, 04 | 500 |
| | Mohan Rao. M.J. | Nov, 05 | 500 |
| 10 | Ananth Reddy | Feb, 05 | 500 |
| | Anantha Reddy | Oct, 05 | 500 |
| 11 | Ramachandraiah. R. | Jun, 05 | 500 |
| | Ramachandraiah | Jun, 06 | 500 |
| 12 | S.V. Kannaiah | Dec. 08 | 500 |
| | Kannaiah. S.V. | Nov, 05 | 500 |
| 13 | Badraiah D | Jun, 06 | 500 |
| | Bhadraiah | Mar, 12 | 500 |
| 14 | Rajaram Singh, New Palvancha | Sep, 11 | 500 |
| | Rajaram Singh, New Palvancha | July, 12 | 500 |
| 15 | D. Kishore Kumar | April, 13 | 500 |
| | D. Kishore Kumar | May, 13 | 500 |

## జీవిత సభ్యత్వం కొరకు ఒక దఫా మాత్రమే చెల్లించినవారి వివరములు

**2002 – మే 2015 వరకు, ఖమ్మం జిల్లా**

| | | | |
|---|---|---|---|
| 1 | Y. Jayasri | June, 13 | 500 |

# ప్రభుస్తుతి

## ప్రభుస్తుతి

ఓ పర్‌వర్దిగార్,
సర్వపోషకా! సర్వ రక్షకా!
నీవు ఆదియును
అంతమును లేని వాడవు,
అద్వయుడవు,
నిరుపమానుడవు,
నీ ప్రమాణమెవ్వరును
ఎరుంగనేరరు
నీవు వర్ణము,
నామము,
రూపము,
గుణములు లేని వాడవు.
నీవు అపరిమితుడవు
గంభీరుడవు,
ఊహాతీతుడవు,
భావనాతీతుడవు,
శాశ్వతుడవు
నాశము లేని వాడవు.
నీవు అవిభాజ్యుడవు,
దివ్యచక్షువులతో గాని
నిన్నెవరును చూడజాలరు
నీవు ఎల్లప్పుడు నుంటివి,
నీవు ఎల్లప్పుడు నున్నావు
నీవు ఎల్లప్పుడు నుందువు
నీవు అంతటను గలవు,
నీవు అన్నింట నున్నావు.

మరి నీవు అంతటికి
అన్నింటికి
ఆవలనుందువు.
నీవు ఆకాశమును గలవు
పాతాళమున గలవు
నీవు వ్యక్తుడవు
అవ్యక్తుడవు,
అన్ని భూమికలందున్నావు,
అన్ని భూమికల కతీతుడవు.
నీవు మూడు లోకాలలోనున్నావు
ముల్లోకాల కావలగూడ నున్నావు.
నీవు అగోచరుడవు,
స్వతంత్రుడవు.
నీవు సృష్టికర్తవు,
ప్రభువులకు ప్రభుడవు,
అందరి మనస్సులను
హృదయములను
ఎరిగిన వాడవు,
నీవు సర్వశక్తిమంతుడవు,
సర్వవ్యాపివి,
నీవే అనంతజ్ఞానము,
అనంత శక్తియు,
అనంత ఆనందమును.
నీవు జ్ఞానసాగరుడవు,
సర్వజ్ఞుడవు,
అనంత జ్ఞానివి,

త్రికాల వేదివి,
జ్ఞానమే నీవు,
నీవు సర్వదయాళుడవు,
నిత్య శుభంకరుడవు,
నీవు ఆత్మలకెల్ల నాత్మవు
అనంతగుణ విశిష్టుడవు,
నీవు సత్య, జ్ఞాన
ఆనందముల
త్రిమూర్తివి,
నీవే సత్యమునకు
మూలము,
ప్రేమ మహాసాగరుడవు,
నీవు పురాణ పురుషుడవు,
సర్వోత్తముడవు,
నీవు ప్రభుడవు,
పరమేశ్వరుడవు,
నీవు పరుడవు,
పరాత్పరుడవు,
నీవు పరబ్రహ్మవు,
పరమాత్మవు,
అల్లాహ్,
ఇలాహీ,
యజ్‌దాన్,
అహురమజ్ దా,
ప్రియతముడైన
భగవంతుడవు,
నీవు 'ఈజద్' అనబడు
ఏకైక పూజ్యుడవు.

# పశ్చాత్తాప ప్రార్థన

**ఓం పరబ్రహ్మ - పరమాత్మా**
**యా - యాజ్‌దాన్**
**లా ఇలాహ్ ఇల్లిల్లాహ్**
**ఓ గాడ్ ఫాదర్ ఇన్ హెవెన్**
**ప**రమ దయానిధివగు ఓ ఈశ్వరా!
మా పాపములన్నిటికిని
మేము పశ్చాత్తాప పడుచున్నాము
అసత్యము, అధర్మము,
అపవిత్రమును అగు
మా ప్రతి తలంపునకును,
పశ్చాత్తాప పడుచున్నాము.
పలికి యుండరాని పలికిన
ప్రతి మాటకును,
చేసి యుండరాని చేసిన
ప్రతి చేతకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
స్వార్థముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని, ప్రతి మాటకును
ప్రతి తలంపునకు,
ద్వేషముచే ప్రేరేపింపబడిన
ప్రతి పనికిని,
ప్రతి మాటకును
ప్రతి తలంపునకును,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ ముఖ్యంగా,
కామముతో కూడిన
మా ప్రతి తలంపునకును
కామ ప్రేరితమగు
మా ప్రతి చేతకును
పలికిన ప్రతి అనృతమునకును,
సమస్త కపటవర్తనమునకును,
ఆడి తప్పిన
ప్రతి వాగ్దానమునకును,
సమస్త పరనిందలకు,
పరోక్ష నిందలకు,
మేము పశ్చాత్తాప పడుచున్నాము.
ఇంకనూ, ముఖ్యముగా కూడా,
పరులకు నాశన మొనగూర్చునట్టి
మేము చేసిన ప్రతి పనికిని,
ఇతరులకు బాధ కలుగజేసినట్లు
మేమాడిన ప్రతి మాటకును,
చేసిన ప్రతి చేతకును,
ఇతరులకు బాధ కలుగవలెనని
మేము కోరిన ప్రతి కోర్కెకును,
మిక్కిలి పశ్చాత్తాపపడుచున్నాము.
నీ యొక్క అపార దయతో ఓ ఈశ్వరా!
మేము చేసిన
ఈ పాపములన్నిటిని
క్షమింప వేడుకొనుచున్నాము.
తలపులలో కాని, మాటలలో కాని
చేతలలో కాని
నీ ఇచ్ఛానుసారము నడుచుకొన జాలక
నిరంతరము విఫలులమగుచున్న
మమ్ములనందరిని క్షమింప
వేడుకొనుచున్నాము.

# మండలి ప్రార్థన

ప్రియ దైవమా!

నిన్ను అధికాధికముగా ప్రేమించునట్లును, ఇంకను అధికముగా నీతో ఐక్యమగునంతటి అర్హతగల వారమగునంతవరకును నిన్నింకను అధికముగ ప్రేమించునటుల మాకందరకు సహాయము చేయుము.

మరియు చిట్టచివరి వరకు బాబా కొంగును దృఢముగా పట్టుకొని ఉండుటకై మాకందరకు సహాయము చేయుము.

## జీవిత సభ్యతం

**2015 ఏప్రిల్ - మే నెలలో పంపిన వారి వివరాలు**

| నెం. | | పేరు, ప్రాంతము | చెల్లించిన సొమ్ము |
|---|---|---|---|
| 1. | ఏప్రిల్ | అవతార్ మెహెర్‌బాబా నిలయం, తూ.గోదావరి | రూ. 1000.00 |
| 2. | ఏప్రిల్ | .........., చల్లపల్లి | రూ. 1000.00 |
| 3. | ఏప్రిల్ | వడ్లమూడి గంగాధరరావు, తూ. గోదావరి | రూ. 1000.00 |
| | | మొత్తం | **రూ. 3000.00** |

# మెహెర్‌బాబా పత్రిక

మెహెర్‌బాబా పత్రిక జీవిత సభ్యత్వం రూ. 1000/-. ఆన్‌లైన్‌లో పంపగోరువారు శ్రీమతి శారద, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, సైనిక్‌పురి బ్రాంచి, సికింద్రాబాద్.
**SB A/C NO: 173201000027973. IFSC CODE: IOBA 0001732.**

## మా అడ్రస్:

ఎడిటర్, మెహెర్‌బాబా,
గోదావరి గార్డెన్స్, బాబాస్ హౌస్,
యాప్రాల్, ప్లాట్ నెం.32,
జె.జె. నగర్ కాలనీ పోస్టు,
సికింద్రాబాద్-500087.
ఫోన్: 99595-53218.
**email: malladisukku@gmail.com**

Printed and published and owned by Dasika Nirmaladevi printed at Sai Srinivasa Printers, Khairatabad, Hyderabad, published at Koti Meher Centre, Esamia Bazar, Koti, behind Govt. Women's College, Hyderabad.

**Editor: D. Nirmaladevi**

RNI No. APTEL/2002/7310, Postal Concession: R&D/RNP/HSE/789/2014-2016, **Dt.06-01-2014,** Date of Publication 17th of every month